
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | శనివారం 31 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 261 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516
విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి
Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## మీకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా..

- పహల్గాం ఉగ్రదాడిపై ప్రధాని మోదీ
- ఆపరేషన్ సిందూర్‌లో మన దళాలు నిమిషాల వ్యవధిలో మెరుపు వేగంతో వారిని అణిచేశాయి
- పాక్ ఉగ్రస్థావరాల్ని నేలమట్టం చేయడమే కాదు, నిమిషాల వ్యవధిలోనే పాక్ వైమానిక స్థావరాల్ని ధ్వంసం చేశాయి
- పాకిస్తాన్‌తోపాటు ప్రపంచ దేశాలు ఆపరేషన్ సిందూర్ పవర్‌ని చూశాయి
- ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల చరిత్ర ముగిసిపోతుంది.

## పారిశ్రామికవేత్తల ద్వారానే
# సంపద సృష్టి సాధ్యం

- సంపద సృష్టి జరగకపోతే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేం
- సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందని..
- సీఐఐ వార్షిక సమ్మేళనంలో సీఎం చంద్రబాబు
- పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చేశాయి
- మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం
- "ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి
- అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం





**దిల్లీ**

సంపద సృష్టి జరగకపోతే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేమని.. సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలు, ఏపీలో అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను వివరించారు. సంపద సృష్టిలో ఏపీకి పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు. పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చేశాయన్నారు. 1990లో ఇంటర్‌నెట్ విప్లవం వచ్చిందని, దాన్ని ముందుగా అందుకున్న వాళ్లలో తానూ ఒకడినని పేర్కొన్నారు. - మిగతా3లో



## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి
# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- గిరిజనుల సమస్య తీరిందన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఎన్నికల హామీ మేరకు లక్కవరం నుంచి చీడిగొండ వరకూ రూ.87.19 లక్షల వ్యయంతో 1.01కి.మీ. రహదారి నిర్మాణం




## భారత్‌ను ఆపాలని పాక్ ప్రపంచ దేశాలను వేడుకుంది

- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- 'మన దేశం శక్తిమంతమైన దాడులు చేయడంతో భారత్‌ను ఆపాలని పాకిస్థాన్ ప్రపంచదేశాలను వేడుకుంది
- మన నిబంధనల ప్రకారమే సైనిక చర్యలను ఆపేశాం
- ఆపరేషన్ సమయంలో నేవీ పాత్ర అద్భుతమైనది

## వెన్నుపోటు దినంగా జూన్ 4

### పోస్టర్ ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



- ఏడాది పాలనలో ఓటు వేసిన ప్రజలకు వెన్నుపోటు
- అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీనీ పూర్తిగా అమలు చేయలేదు
- సపూరిత వాగ్ధానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు
- చంద్రబాబు మోసాలను ఎండగడుతూ జూన్ 4న 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసనలు

**తాడేపల్లి**

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజ లను వెన్నుపోటు పొడిచిందని వైఎస్సా ర్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృ ష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో జూన్ 4న పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. - మిగతా3లో




## రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు

- పభుత్వానికి మంచిపేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పనిచేయాలి
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరకులు పంపిణీ
- ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు సరకుల పంపిణీ పూర్తి చేయాలి




# జిల్లాల పేర్లు మార్పు?




**వైసీపీ హయాంలో జిల్లాల విభజన, జిల్లాల పేర్ల మార్పులు విషయంలో నాటి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించింది.**

**విజయవాడ**

జిల్లాల పేర్ల వ్యవహారంలో వైసీపీ హయంలో జరిగిన పొరపాట్లే కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్నాయి. ప్రజల అభిప్రాయాలతో సంబంధం లేకుండా జిల్లాల విభజన, వాటి పేర్లను నిర్ణయిస్తూ గత ప్రభుత్వం చేసిన తప్పుల్ని కూటమి ప్రభుత్వం సరిచేసే ప్రయత్నాలు చేయడం లేదు. వైసీపీ హయాంలో జిల్లాల విభజన, జిల్లాల పేర్ల మార్పులు విషయంలో నాటి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించింది. చారిత్రక నేపథ్యం, పురాతన వారసత్వం, స్థానిక ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా రాజకీయ కారణాలతో జిల్లాల విభజన ఎడాపెడా చే సేశారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అప్పట్లో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై కసరత్తు ప్రారంభించినపుడు ప్రధానంగా లోక్‌సభ నియోజక వర్గాలను ప్రాతిపదికగా చేసుకున్నారు. కడపను వైఎస్సార్ కడపగా మార్చిన ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాను మాత్రం విస్మరించింది. ఈ క్రమంలో జిల్లాలు, స్థానిక మండలాల్లోని గ్రామాల్లో ప్రజలకు ఉన్న అనుబంధాలను పోగొట్టుకోవాల్సి వచ్చింది. పార్లమెంటు నియోజక వర్గాలు వేర్వేరుగా ఉన్నా ఉమ్మడి జిల్లాలకు మాత్రం ఐదారు దశాబ్దాలుగా కొనసాగుతూ వచ్చాయి. జిల్లాల సరిహద్దుల విభజనలో ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. - మిగతా3లో

# మీకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా..


**పాట్నా:** పహల్గాం నిందితుల్ని మట్టిలో కలిపేస్తానని ఆరోజు మాట ఇచ్చా.. ఇచ్చిన మాట ప్రకారం ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదాల్ని హతమార్చాం' అని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ప్రధాని మోదీ బీహార్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడి తర్వాత తొలిసారి బీహార్‌లో పర్యటించిన సమయంలో మీకు హామీ ఇచ్చా. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడింది. వాళ్ల వెనకున్నది ఎంతటి వారినైనా ఉపేక్షించబోనని. మీకు మాట ఇచ్చినట్లుగా ఆపరేషన్ సిందూర్‌తో పహల్గాం ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపాం. ఆ నాడు మీకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని బీహార్ గడ్డపై అడుగుపెట్టా. ఆపరేషన్ సిందూర్‌లో మన దళాలు నిమిషాల వ్యవధిలో మెరుపు వేగంతో వారిని అణిచేశాయి. పాక్ ఉగ్రస్థావరాల్ని నేలమట్టం చేయడమే కాదు, నిమిషాల వ్యవధిలోనే పాక్ వైమానిక స్థావరాల్ని ధ్వంసం చేశాయి. పాకిస్తాన్‌తోపాటు ప్రపంచ దేశాలు ఆపరేషన్ సిందూర్ పవర్‌ని చూశాయి. ఉగ్రవాదంపై మా పోరు ఆగదు. ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టుల చరిత్ర



ముగిసిపోతుంది. చాలా జిల్లాలు మావోయిస్టుల ప్రభావం నుంచి బయటపడ్డాయి. ఇది నయా భారత్. ఇదే భారత్‌కు కొత్త బలం అని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపేస్తాం.. పహల్గాం ఉగ్రదాడి తర్వాత బీహార్‌లో ప్రధాని మోదీ "మిత్రులారా.. బిహార్ గడ్డపై నుంచి మొత్తం ప్రపంచానికి చెబుతున్నా. ఉగ్రవాదులు, వారికి మద్దతిస్తున్నవారిని మట్టిలో కలిపేస్తాం. వాళ్లు ఎక్కడ దాగి ఉన్నా సరే గుర్తించి, బంధించి, శిక్షిస్తాం. ప్రపంచం అంచుల దాకా వారిని వేటాడుతాం. కలలో కూడా ఊహించలేని విధంగా శిక్ష విధిస్తాం. ఉగ్రవాదులెవరూ తప్పించుకోలేరు. ముష్కర మూకలను చట్టం ముందు నిలబెట్టడం తథ్యం. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం కుట్రదారుల వెన్నువిరచడం ఖాయం. శిక్ష తప్పనిసరిగా ఉంటుందన్న సంగతి గుర్తుంచుకోవాలి. ఈ విషయంలో మన దేశమంతా ఒకే మాటపై ఉంది. మానవత్వాన్ని విశ్వసించే వారంతా మన వెంటే ఉన్నారు. ఉగ్రవాదుల హేయమైన చర్య మనసున్న ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. వారికి దేశమంతా మద్దతుగా నిలుస్తోంది. ఎవరూ అధైర్యపడాల్సిన పని లేదు. ఈ ప్రతికూల సమయంలో మనకు అండగా నిలిచిన ప్రపంచ దేశాల నేతలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా" అని ప్రధాని మోదీ అన్నారు.

# భారత్‌ను ఆపాలని పాక్ ప్రపంచ దేశాలను వేడుకుంది

**ఇంటర్నెట్‌డెస్క్:** భారత నౌకాదళానికి చెందిన విమాన వాహకనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను శుక్రవారం కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన అక్కడి అధికారులతో మాట్లాడారు. అనంతరం ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'మన దేశం శక్తిమంతమైన దాడులు చేయడంతో భారత్‌ను ఆపాలని పాకిస్థాన్ ప్రపంచదేశాలను వేడుకుంది. మన నిబంధనల ప్రకారమే సైనిక చర్యలను ఆపేశాం. ఆపరేషన్ సమయంలో నేవీ పాత్ర అద్భుతమైనది. పాక్ గడ్డపై ఉన్న ఉగ్రవాద స్థావరాలను వైమానిక దళం నేలమట్టం చేసింది. అదే సమయంలో మన నావికాదళం సముద్రంలో చూపిన సంసిద్ధత పాక్ నావికాదళాన్ని ఎక్కడికీ కదలనీయకుండా చేసింది. మీ ముందస్తు మోహరింపుతో



పాక్ ధైర్యంపై దెబ్బకొట్టారు. మీరు పాక్‌పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదు. మీ సన్నద్ధతే దాయాదికి గట్టి హెచ్చరిక. భారత నావికాదళ శక్తిని, సైనిక చర్యలను, సామర్థ్యాలను చూసి శత్రుదేశం భయాందోళనకు గురైంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని.. ఇచ్చింది విరామమేనని పేర్కొన్నారు. పాక్ మరో తప్పు చేస్తే ఈసారి కోలుకునే అవకాశమే లేకుండా గట్టిగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించి పాక్‌లోని ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే పాక్ ప్రతిస్పందనను నావికాదళం పసిగట్టి.. తమ సంసిద్ధతను గణనీయంగా పెంచడానికి పలు చర్యలు తీసుకుంది. పాక్‌లోని కరాచీ పోర్టు లక్ష్యంగా ఐఎన్ఎస్ విక్రాంత్ బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది.

# పాక్‌లో ఉగ్రవాదులు హతమైతే సంతాపమా?

ఇంటర్నెట్‌డెస్క్: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ అసహనం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అందులో శశిథరూర్ నాయకత్వంలోని బృందం ప్రస్తుతం కొలంబియా కు వెళ్లింది. ఈక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఉగ్రవాద దాడుల బాధితులపై సానుభూతి వ్యక్తపరచకుండా.. భారత్ దాడుల తర్వాత పాక్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడం మమ్మల్ని నిరాశ పరిచింది. మా ఆత్మరక్షణ హక్కును మాత్రమే మేము వినియోగించుకున్నాం. ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులను గురించి కొలంబియా అధికారులతో వివరంగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ దేశం కూడా అనేక ఉగ్రదాడులను చూసింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత్ అనేక దాడులను భరించింది. పాకిస్థాన్ తన సైనిక పరికరాలను వారి రక్షణ కోసం కాకుండా.. పక్క దేశాలపై దాడి కోసం వినియోగిస్తోంది. ఉగ్రదాడికి వ్యతిరేకంగా మాత్రమే మా విధానాలు ఉంటాయి' అని థరూర్ పేర్కొన్నారు. పహల్గాం దాడి వెనక పాక్ ప్రాయోజిత ఉగ్రవాదం ఉందనడానికి భారత్ వద్ద కచ్చితమైన ఆధారాలున్నాయని థరూర్ వెల్లడించారు.



ఈసందర్భంగా పాక్‌లోని మొత్తం రక్షణ పరికరాల్లో 81శాతం చైనా నుంచి అందుతున్నవేనని తెలిపారు.

**ముష్కరులను ఎగదోస్తే ఉగ్ర నరసింహావతారమే**

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో భారత్ ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించి.. పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను నేలమట్టం చేసింది. ఈ దాడుల్లో 170 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. దీనికి పాక్ సైన్యం స్పందించి.. మనపై ప్రతిదాడులకు దిగింది. వాటిని మన బలగాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయి. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతుంది.

# యూపీలో దారికొస్తున్న నేరస్తుల ముఠాలు

**లక్నో :** యూపీ పోలీసులు మరోసారి నేరస్థులపై తమ వైఖరిని కఠినతరం చేశారు. గత 24 గంటల్లోనే పోలీసులు 14 ఎన్‌కౌంటర్‌లు నిర్వహించారు. వీటిలో లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన ఒక పేరు మోసిన నేరస్థుడిని పోలీసులు హతమార్చగా, మిగిలిన 13 కేసుల్లో నేరస్థులను కాళ్లపై కాల్చి పట్టుకున్నారు. పోలీసుల ఈ చర్య కారణంగా నేరస్థులలో భయాందోళనలు నెలకొన్నాయి. పరిస్థితి ఎలా ఉందంటే, పదుల సంఖ్యలో నేరస్థులు చేతులు పైకెత్తి పోలీసుల ముందు లొంగిపోయారు. లారెన్స్ గ్యాంగ్ దుండగుడు నవీన్‌ను ఉత్తరప్రదేశ్ పోలీసుల ఎస్‌టిఎఫ్, ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. నవీన్ లారెన్స్ గ్యాంగ్‌లో షార్ప్ షూటర్. అతనిపై ఢిల్లీ, యుపిలో అర డజనుకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలోనే యుపి ఎస్టీఎఫ్ కు ఒక సమాచారం అందింది. ఆపై ఢిల్లీ పోలీసులతో కలిసి ఎస్టీఎఫ్ హాపూర్ లోని కొత్వాలి ప్రాంతంలో ఈ నేరస్థుడిని చుట్టుముట్టింది. ఈ సమయంలో, నవీన్ పోలీసు బృందంపై కాల్పులు జరిపాడు. కానీ అప్పటికే అప్రమత్తమైన పోలీసు బృందం ప్రతీకారం తీర్చుకుని అతన్ని చంపింది. యుపి పోలీసులు రాజధాని లక్నో నుండి ఎన్‌కౌంటర్ ప్రారంభించారు. ఇక్కడ పోలీసులకు ఒక రహస్య నేరస్థుడు కమల్ కిషోర్ గురించి ఒక సమాచారం అందింది. అతను 5 సంవత్సరాల అమాయక బాలికపై అత్యాచారం చేసి పరారీలో ఉన్నాడు. అందించిన సమాచారం ప్రకారం, మదేగంజ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో పోలీసులు అతన్ని చుట్టుముట్టడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో, ఈ నేరస్థుడు పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు యత్నించాడు. ఈ పరిస్థితిలో, పోలీసులు కూడా ప్రతీకార కాల్పులు జరిపి అతన్ని పట్టుకున్నారు.



సీతాపూర్ జిల్లాలోని కామియాపూర్ నివాసి అయిన ఈ నేరస్థుడు ఇక్కడి ఆనకట్ట సమీపంలోని మురికివాడల్లో నివసిస్తున్నాడు. మరోవైపు, ఘజియాబాద్ పోలీసులు ముఖాముఖి ఎన్‌కౌంటర్‌లో పేరుమోసిన దొంగను కూడా పట్టుకున్నారు. జలౌన్ నేరస్థులలో పోలీసుల భయం కనిపించింది. ఇక్కడ కొంచ్‌లోని నవీన్ జ్యువెలర్స్ దుకాణంలో దోపిడీకి పాల్పడిన ఇద్దరు నేరస్థులను పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులు ఈ నేరస్థులను లొంగిపోవాలని కోరారు. కానీ రాజేంద్ర కుష్వాహా కుమారుడు గోలు అలియాస్ అజయ్ కుష్వాహా అనే నేరస్థుడు పోలీసులపై కాల్పులు జరిపాడు. అటువంటి పరిస్థితిలో, పోలీసులు కూడా కాల్పులు జరిపారు. అయితే అజయ్ కాలిపై తూటా దిగింది. అతనిపై కాల్పులు జరపడం చూసి, అతని స్నేహితుడు రాము కుష్వాహా వణికిపోయాడు. అతనే చేతులు పైకెత్తి లొంగిపోయాడు. యుపి పోలీసుల అనేక ఇతర జిల్లాల్లో ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారు. ఉన్నావ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పోలీసులు ఒక నేరస్థుడిని అరెస్టు చేశారు. అయితే మరో ఇద్దరు నేరస్థులు తప్పించుకోగలిగారు. అదేవిధంగా, బులంద్‌షహర్‌లో, 6 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని ఖుర్జా దేహత్ పోలీసులు ఎన్‌కౌంటర్ సమయంలో అరెస్టు చేశారు. బాగ్‌పత్ పోలీసులు ఇద్దరు చైన్ స్నాచర్లను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి, ఆగ్రా పోలీసులు ఒక నేరస్థుడిని కాలిపై కాల్చి పట్టుకున్నారు. మరోవైపు, ఝాన్సీలో, మాత్ కొత్వాలి పోలీసులు రూ. 25,000 బహుమతిని ప్రకటించిన నేరస్థుడిని ఎదుర్కొన్నారు. అదే సమయంలో, బల్లియా పోలీసులు ఒక గంట వ్యవధిలో రెండు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు నేరస్థులను అరెస్టు చేశారు. సహారన్‌పూర్ భట్టా మునిమ్‌ను దోచుకున్న దుండగులను ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి యూనిట్ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో పట్టుకున్నారు. ఇదిలా ఉండగా, ఎన్‌కౌంటర్ సమయంలో హాపూర్ పోలీసులు నలుగురు దుండగులను అరెస్టు చేశారు. నేరస్థులలో ఒకరి కాలులో బుల్లెట్ దిగింది. కాగా, మరో నేరస్థుడు కాల్చి చంపారన్న భయంతో లొంగిపోయాడు. మరోవైపు, ముజఫర్ నగర్‌లో, పోలీసులు ముగ్గురు దుండగులను కాలిపై కాల్చి అరెస్టు చేశారు. అదే క్రమంలో, లక్నోలోని అలంబాగ్ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో ఒక నేరస్థుడిని అరెస్టు చేశారు.

## బీఎస్ఎఫ్ దెబ్బకు.. ౧
## పాక్ ఇప్పట్లో కోలుకోవడం కష్టమే!



**ఇంటర్నెట్ డెస్క్:** పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించారు. ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కూల్చివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. "ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దులోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చేశాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దులో ఎటువంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు.

**త్వరలో ప్యాకేజీ..**

జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన అక్కడి స్థానికులతో మాట్లాడారు.

## సీబీఐ వలలో ఈడీ డిప్యూటీ డైరెక్టర్ రఘువంశీ



**ఒడిశా:** లంచం తీసుకుంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) డిప్యూటీ డైరెక్టర్ రఘువంశీ సీబీఐ వలకు చిక్కారు. రూ.20 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు 2013 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారి అయిన రఘువంశీ, ఓ మైనింగ్ కేసుకు సంబంధించి.. భువనేశ్వర్‌కు చెందిన ఓ వ్యాపారి వద్ద నుంచి రూ. 20 లక్షల లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కారు. ఏడాదిన్నరగా రఘువంశీ భువనేశ్వర్ జోనల్ కార్యాలయంలో ఈడీ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రఘువంశీని అరెస్ట్ చేసిన అధికారులు.. భువనేశ్వర్‌లోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విచారిస్తున్నారు.

## నన్ను బెదిరించి క్షమాపణలు చెప్పించలేరు

**ఢిల్లీ:** కన్నడ భాష వివాదంపై ప్రముఖ నటుడు కమల హాసన్ స్పందించారు. కన్నడ భాష వివాదంపై క్షమాపణలు చెప్పేందుకు నిరాకరించారు. నన్ను బెదిరించి క్షమాపణ చెప్పించలేరు. కన్నడపై నా ప్రేమ నిజం. అజెండా ఉన్నవారికి మాత్రమే నా మాటలపై అభ్యంతరం' అని వ్యాఖ్యానించారు.



కన్నడ సినిమాలపై ఇటీవల చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలనే డిమాండ్లను కమల్ హాసన్ శుక్రవారం తోసిపుచ్చారు. తాను తప్పు చేసి ఉంటేనే క్షమాపణ చెబుతానని, ప్రస్తుత వివాదం అలాంటి కాదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇది తన జీవన విధానం. దీనిలో ఇతరులు జోక్యం చేసుకోవద్దని కోరారు. తప్పు చేస్తే నేనే క్షమాపణ చెబుతాను. నేను తప్పు చేయకపోతే క్షమాపణ చెప్పను. ఇది నా జీవనశైలి. దయచేసి దాన్ని చెడగొట్టకండి. మనదేశం ప్రజాస్వామ్య దేశం. నేను చట్టం. న్యాయాన్ని నమ్ముతాను' అని ఆయన అన్నారు

## అపార్ట్‌మెంట్ కిటికీ నుంచి 500 నోట్ల వర్షం..
## ఏమైందో తెలిసే లోపే ట్విస్ట్..

**భువనేశ్వర్:** ఒక ప్రభుత్వ ఇంజినీర్ ఇంట్లో ఆదాయానికి మించిన ఆస్తులు బయటపడ్డాయి. భారీ అవినీతి తిమింగలం విజిలెన్స్‌కు చిక్కింది. విజిలెన్స్ అధికారులు తన ఇంటికి వస్తున్నారన్న విషయం తెలుసుకుని సదరు అధికారి.. ఇంట్లోని నోట్ల కట్టలను కిటికీలోంచి



బయటపడేశాడు. ఆ కరెన్సీ నోట్ల వర్షంతో స్థానికులు అవాక్కయ్యారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖలో బైకుంఠనాథ్ సారంగి చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారంటూ ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు.. సోదాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి ఒడిశాలోని అంగుల్, భువనేశ్వర్, పూరిలోని పిపిలి సహా మొత్తం ఏడు ప్రాంతాల్లోని సారంగి నివాసాలు, కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇళ్లలో అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు.

# పారిశ్రామికవేత్తల ద్వారానే సంపద సృష్టి సాధ్యం

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం భారత్‌కు జనాభా అనుకూలత ఉందన్న చంద్రబాబు.. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు.

**మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం**

"ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాలు, సెన్సార్లు, ఐఓటీలు.. ఇలా చాలా టెక్నాలజీ వచ్చింది. ఇప్పుడు సమాజానికి కావాల్సింది పారిశ్రామికవేత్తలే. నేను నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్నా.. చాలా మంది నాయకులను చూశాను. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ప్రధానిగా ఉన్నారు. మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం.

1995 నుంచి తాను మాత్రమే దావోస్‌కు తరచూ వెళ్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. సంపద సృష్టి జరగాలని, అది పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమని ఉద్ఘాటించారు. సంపద సృష్టి ద్వారానే పేదల ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేశారు. ఇవాళ(శుక్రవారం) ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా సీఐఐ సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఏపీ అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ విధానాలపై ప్రసంగించారు. ఆదాయం పెరిగితే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చని వెల్లడించారు. సరైన సమయంలో దేశానికి ప్రధానిగా నరేంద్రమోదీ ఉన్నారని ప్రశంసించారు. భారత్‌కు మోదీ నాయకత్వం



ప్రధాన బలమని కొనియాడారు. చైనా ఆర్థిక వ్యవస్థ భారత్‌కు నాలుగున్నర రెట్లు, అలాగే అమెరికా ఆర్థిక వ్యవస్థ ఏడు రెట్లు ఎక్కువని వివరించారు సీఎం చంద్రబాబు.

సరైన పాలసీలు రూపొందిస్తే మన ప్రగతిని ఎవరూ ఆపలేరని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. దేశానికి రానున్న పదేళ్లు అత్యంత కీలకమని అన్నారు. హైదరాబాద్ బ్రౌన్ ఫీల్డ్ సిటీ.. అమరావతి గ్రీన్ ఫీల్డ్ సిటీ అని అభివర్ణించారు. ఐటీ పరిశ్రమల వల్లే హైదరాబాద్‌కు లబ్ధి జరిగిందని స్పష్టం చేశారు. 2047 విజన్ లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని వివరించారు. సాంకేతిక విప్లవంలో చాలా మార్పులు వచ్చాయని, ఏపీలో 15 శాతం వృద్ధి రేటు తన లక్ష్యమని వెల్లడించారు. అమరావతిలో దేశంలోనే తొలిసారి క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయబోతున్నామని, విశాఖపట్నానికి టీసీఎస్, గూగుల్, మిట్టల్ పరిశ్రమలు వచ్చాయని తెలిపారు సీఎం చంద్రబాబు.

అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నాను.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నాను. విశాఖలో టీసీఎస్ మొదలవుతోంది.. ఆర్సెల్లార్ మిట్టల్ పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. విశాఖకు గూగుల్ రాబోతోంది. ఏపీలో గ్రీన్ ఎనర్జీకి మంచి అవకాశాలు ఉన్నాయి. సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ.. అన్నింటిలోనూ ఏపీ ముందు వరుసలో ఉంది. గ్రీన్ ఎనర్జీ కోసం ఎన్నో కంపెనీలు చాలా ఆసక్తిగా ఉన్నాయి. ఏడాదిలో రూ.5లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు అందుకున్నాం. ఈ ప్రాజెక్టుల ద్వారా నాలుగున్నర లక్షల ఉద్యోగాలు వస్తాయి. మైనింగ్, టూరిజంలోనూ ఏపీలో మంచి అవకాశాలు ఉన్నాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటవుతోంది. 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్క్‌లు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలన్నదే నా లక్ష్యం. గతంలో ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు వరుసగా 7-8 ఏళ్లు సీఐఐ సదస్సులు నిర్వహించాం. మొదటి నుంచి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ వచ్చాను" అని చంద్రబాబు వివరించారు.

# వెన్నుపోటు దినంగా జూన్ 4..

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్ధానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్కరోజు కూడా ప్రజల గురించి ఆలోచన చేయని ఒక దుర్మార్గమైన పాలనను దేశంలోనే మొదటిసారిగా చూస్తున్నామని అన్నారు. ఈ వంచనను ప్రశ్నిస్తూ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసనలతో ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరిపిస్తామని అన్నారు. ఇంకా ఆయనేమన్నారంటే.. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు తమ నిరంకుశ, అరాచక విధానాలను పరిచయం చేసింది. కూటమి పార్టీలు మోసపూరిత వాగ్ధానాలతో ప్రజలను భ్రమల్లో పెట్టి అధికారంలోకి వచ్చి జూన్ 4వ తేదీకి ఏడాది అవుతోంది. ఒక్క ఎన్నికల హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా, అడ్డంగా ప్రజలను మోసం చేయడం చరిత్రలో ఎప్పుడూ జరిగి ఉండదు. దానిని ప్రశ్నించకుండా రాష్ట్రంలో ప్రభుత్వమే భయోత్పాతాన్ని సృష్టించిన చరిత్ర కూడా ఎప్పుడూ ఎవరూ చూసి ఉండరు. అధికారంలో వచ్చిన తొలి రోజు నుంచే ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుడుతూ, ఏడాదిలోనే తొంబై తొమ్మిదిశాతం అమలు చేసిన ఘనత వైయస్ జగన్‌ది. అలాగే విప్లవాత్మక వ్యవస్థలను సృష్టించి, ఆచరణలోకి తీసుకువచ్చి, ప్రజల వద్దకే సుపరిపాలనను తీసుకువెళ్ళి అందించి చరిత్ర సృష్టించారు. దానికి భిన్నంగా ఆ వ్యవస్థలను విధ్వంసం చేస్తూ, అరాచక పాలనను ఏడాదిలోనే చంద్రబాబు ప్రజలకు చవిచూపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎటువంటి దారుణాలకు పాల్పడవచ్చో కూడా చంద్రబాబు నిరూపించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలపై ఆనాడే వైఎస్ జగన్ స్పందిస్తూ, వాటిని అమలు చేసే ఉద్దేశం చంద్రబాబుకు లేదని, ప్రజలను మోసం చేయడానికే ఇటువంటి హామీలు ఇస్తున్నారని చాలా స్పష్టంగా చెప్పారు.

ఇప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తాను ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం చాలా కష్టమని చెబుతున్నారు. సంపద సృష్టిస్తానని, పేదల బతుకుల్లో వెలుగులు తీసుకువస్తానంటూ మాట్లాడిన చంద్రబాబు



ఇప్పుడు పీ-4 అంటూ కొత్త డ్రామాలు మొదలు పెట్టారు. పేదరికాన్ని నిర్మూలించే బాధ్యత నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి మోసం బహుశా ఎక్కడా మనకు కనిపించదు. 1995లో సొంత మామనే వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. తరువాత 1999, 2014, 2024లోనూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు. గతంలొ హామీలను అమలు చేస్తానంటూ అబద్దాలు చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు బరితెగించి, హామీలను అమలు చేయడం కుదరదంటూ అడ్డంగా మాట్లాడుతున్నాడు.

**రాష్ట్ర వ్యాప్తంగా వెన్నుపోటు దినం ర్యాలీలు**

చంద్రబాబు సీఎంగా తొలి ఏడాదిలోనే రూ.1.49 లక్షల కోట్లు అప్పులు చేశారు. ఆ సొమ్ము దేనికి వినియోగించారో తెలియదు. ఆనాడు మామాకు వెన్నుపోటు పొడిస్తే, ఈ రోజు నేరుగా తనను నమ్మి ఓటు వేసిన ప్రజలకే వెన్నుపోటు పొడిచారు. దీనిని ప్రశ్నిస్తూ వైయస్ఆర్‌సీపీ వెన్నుపోటుదినంను నిర్వహిస్తోంది. నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులు ర్యాలీలుగా వెళ్ళి స్థానికంగా ఉన్న అధికారులకు మెమోరాండంలు సమర్పిస్తాయి. ఎన్నికల హామీలను అమలు చేయాలని, ఈ ఏడాది కాలంగా ప్రజలకు ఇస్తామన్న అన్ని పథకాల లబ్ధిని దానిని తక్షణం విడుదల చేయాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు మోసపోయిన ప్రజలు కూడా పాల్గొని, ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిస్తున్నామని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, ఆదిమూలపు సురేష్, అంబటి రాంబాబు, సాకె శైలజానాథ్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, కుంభా రవి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి, ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, కొమ్మూరి కనకారావు, చల్లా మధుసూధన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పేరాడ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాల పేర్లు మార్పు?

-మొదటిపేజీ తరువాయి



ఒక్కో జిల్లాలో సగటున 16-17 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండేవి. ఉదాహరణకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో తూర్పు కృష్ణాలోని మచిలీపట్నం పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో 7 సెగ్మెంట్లు, విజయవాడ పార్లమెంటు పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండేవి. జిల్లాల ఏర్పాటులో తూర్పు కృష్ణాను కృష్ణా జిల్లాగా, విజయవాడను ఎన్టీఆర్ జిల్లాగా విభజించారు. జిల్లాలోని కైకలూరు, నూజివీడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఏలూరు పార్లమెంటు పరిధిలో ఉండేవి. దీంతో ఆ రెండు నియోజక వర్గాలను ఏలూరు జిల్లాలో కలిపేశారు. దీంతో కొల్లేరు ప్రాంతానికి కృష్ణా జిల్లాతో ఉన్న బంధం తెగిపోయింది. నూజివీడును విజయవాడకు దూరం చేసేశారు. చివరకు విజయవాడ నగరం పక్కనే ఉండే గన్నవరం విమానాశ్రయం కూడా కృష్ణా జిల్లాలో కలిసిపోయింది. విజయవాడ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో ఉన్న విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజక వర్గాలతో పాటు మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ నియోజక వర్గాలతో ఎన్టీఆర్ జిల్లాగా కొత్త జిల్లాను వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. విజయవాడ నగరానికి ఉన్న ఘనకీర్తిని మసకబార్చేలా వ్యవహరించారు. చారిత్రకంగా నదీతీరాల్లో విలసిల్లిన నగరాల్లో విజయవాడ ఒకటి. అందుబాటులో ఉన్న శాసనాల్లో శాతవాహనుల కాలం నుంచి విజయవాడ ప్రస్తావన చరిత్రలో ఉంది. కృష్ణానదికి ఉత్తరం వైపున ఉన్న విజయవాడ నగరం ప్రస్తావన అనే శాసనాల్లో వెలుగు చూసింది. చరిత్రలో కృష్ణానదీ తీరంలో విలసిల్లిన విజయవాడ నగరం ఘనమైన వారసత్వాన్ని లేకుండా చేశారు. రాజకీయంగా ప్రత్యర్థుల్ని ఇరకాటంలో పెట్టడానికే ఎన్టీఆర్ పేరును జిల్లాకు పెట్టేశారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో విజయవాడ ప్రస్తావన శాతవాహనుల కాలం నుంచి శాసనాల్లో కనిపిస్తుంది. అయా కాలాలను బట్టి రకరకాల పేర్లతో విజయవాడ నగరాన్ని శాసనాల్లో ప్రస్తావించారు. అందుబాటులో ఉన్న చరిత్ర ఆధారాలతో మధ్యాంధ్ర యుగంలో ప్రముఖ శైవమత క్షేత్రాల్లో ఒకటిగా విజయవాడ నగరం ప్రసిద్ధి పొందింది. బెజవాడ పేరును ప్రస్తావిస్తూ ఆయా కాలాల్లో పాలకులు, మాండలీకులు నుంచి సామాన్యుల వరకు వేయించిన శాసనాల్లో విజయవాడ పేరును పలు రకాలుగా పేర్కొన్నారు. ఇలా బెజవాడచారిత్రకంగా ఇన్ని విధాలుగా వ్యవహరించబడి, చివరికి విజయవాడగా ప్రసిద్ధిపొందింది. ఇవి కాకుండా అమ్మవారిని కొలువైన బెజవాడను బీజవాటిక, బీజపురి, బెజ్జంవాడ, చోళరాజేంద్రపురం, అర్జునపురి, ఆంగ్లేయుల పాలనలో బ్లేజ్‌వాడగా కూడా పేర్కొన్నారు. బెజవాడ ఎండల్ని తాళలేక ఆంగ్లేయులు బ్లేజ్‌వాడగా పేర్కొన్నప్పటికీ బెజవాడ నామానికి దానికి సంబంధం లేదు. జిల్లాల విభజన సమయంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించిన సమయంలో విజయవాడ జిల్లాగా ప్రకటించాలని స్థానికులు, విద్యావంతులు పెద్ద ఎత్తున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అప్పట్లో దానిని వైసీపీ ఖాతరు చేయలేదు. రాజకీయ కారణాలతో టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరు తారక రామారావు పేరుతో జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పటికే వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తొలగించుకునే క్రమంలో ఎన్టీఆర్ పేరుతో జిల్లా పేరును ప్రకటించారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఎన్టీఆర్ జన్మించిన కృష్ణా జిల్లాకు ఆయన పేరు పెట్టాల్సి ఉన్నా అప్పట్లో జగన్ ప్రభుత్వం అలా చేయలేదు. ఏపీలో టంగుటూరి ప్రకాశం పంతులు పేరుతో ప్రకాశం జిల్లా, అమరజీవి పొట్టి శ్రీరాములు పేరుతో ఎస్పీఎస్సార్ నెల్లూరు జిల్లాలు ఉన్నాయి. మాజీ సీఎం వైఎస్ మరణం తర్వాత కడప జిల్లా పేరుకు ముందు వైఎస్సార్ పేరును చేర్చారు. జిల్లాల పునర్విభజన సమయంలో వైఎస్సార్ కడప కాస్త వైఎస్సార్ జిల్లాగా మారింది. విజయవాడ పార్లమెంటు నియోజక వర్గం పరిధిలో ఏర్పాటైన జిల్లాకు మాత్రం ఎన్టీఆర్ పేరును పెట్టారు. మిగిలిన చోట్ల పార్లమెంటు నియోజక వర్గ కేంద్రాలతోనే జిల్లాలు ఏర్పాటు చేశారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తమైనా నాటి ప్రభుత్వం ఖాతరు చేయలేదు. కడపలో మహానాడు కార్యక్రమం ప్రారంభించడానికి ఒక్క రోజు ముందే వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడపగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లా పేరు విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఒకప్పుడు విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న విజయవాడ విమానాశ్రయాన్ని కూడా పక్క జిల్లాలోకి వెళ్లిపోయింది. కూటమి ప్రభుత్వంలో జిల్లా సరిహద్దులు, పేరు విషయంలో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులు వచ్చినా పరిష్కృతం కాలేదు. జిల్లా పేర్లు మార్పు వెనుక ప్రభుత్వానికి దురుద్దేశాలు లేకుంటే, సెంటిమెంట్ ప్రకారం పాత జిల్లా పేర్లు కొనసాగించాలని కోరిక ఉంటే, విజయవాడ నగరానికి ఔఖీ జిల్లాగా కాకుండా, ఎన్టీఆర్ విజయవాడ జిల్లాగా పేరు మార్చాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. వైఎస్సార్ జిల్లా వైఎస్సార్ కడప జిల్లాగా మార్చినప్పుడు .. ఎన్టీఆర్ జిల్లాను ఔఖీ విజయవాడ జిల్లాగా మారిస్తే తప్పేంటని షర్మిల ప్రశ్నించారు.

## రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు..



**విజయవాడ:** ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీ చేపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలో కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీకి సిద్ధం కావాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పనిచేయాలని కోరారు. గతంలో కార్డుదారుల కుటుంబాలకు కుటుంబ పెద్దలా ఉన్న రేషన్ డీలర్లు అదే విధంగా ఇప్పుడు కూడా మనసుపెట్టి పనిచేసి లబ్ధిదారులకు గౌరవంగా సేవలందించాలన్నారు. రేషన్ దుకాణాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడటం, సరైన తూకంతో సరకులు పంపిణీ చేయటం, ధరలు, స్టాక్ బోర్డ్, పోస్టర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతినెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆదివారాల్లో సైతం సరకుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఒకటో తేదీ నుంచి 5వ తేదీలోపే దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ సరకులు పంపిణీ చేసేందుకు చొరవ చూపాలని మంత్రి సూచించారు. వాట్సప్ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించడం వల్ల కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడవచ్చన్నారు. ఒకవేళ ఎప్పుడైనా సాంకేతిక సమస్యలు ఎదురైనాసరే కార్డుదారులకు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకుల పంపిణీ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ-పోస్, వేయింగ్ మిషన్ల రిపేర్లకు సంబంధించి సర్వీసు క్యాంపులు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

అల్లూరి సీతారామరాజు జిల్లా: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ మేరకు అల్లూరి జిల్లా లక్కవరం నుంచి చీడిగొండ వరకూ రహదారిని నిర్మించినట్లు పవన్ తెలిపారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా రోడ్డు నిర్మాణానికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు లక్కవరం నుంచి చీడిగొండ వరకూ రూ.87.19 లక్షల వ్యయంతో 1.01కి.మీ. రహదారిని నిర్మించినట్లు ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. గిరిజన గ్రామాలు, పీవీటిజీ ప్రాంతాలకు రహదారులు నిర్మించాలనే ఉద్దేశ్యంతో కేంద్రం చేపట్టిన పీఎంజాన్‌మాన్ పథకంలో భాగంగా ఈ రహదారిని నిర్మించినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం ద్వారా దాదాపు 183 మంది గిరిజనులకు రహదారి సమస్య పరిష్కారం అయ్యిందని పవన్ వెల్లడించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని పవన్ చెప్పారు. అందులో భాగంగా రూ.1000 కోట్ల నిధులతో అడవి తల్లి బాట కార్యక్రమం చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గిరిజనులను అభివృద్ధికి చేరువ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

## ఆలయ భూముల హస్తగతానికి కూటమి సర్కార్ కుట్ర: మల్లాది విష్ణు



**తాడేపల్లి:** రాష్ట్రంలో దేవాదాయశాఖ భూములను తమ బినామీల పరం చేసేందుకు కూటమి సర్కార్ కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ లీజుల ముసుగులో తమకు కావాల్సిన వారికి కారుచౌకగా దేవాలయ భూములను అడ్డతోవలో ధారాదత్తం చేసేందుకే ప్రభుత్వం ఆగమేఘాల మీద జీవో 139ని జారీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ భూముల లీజులకు సంబంధించి న్యాయ స్థానాలు నిర్ధేశించిన మార్గదర్శకాలను కూడా ఉల్లంఘిస్తూ కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయాలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే.. కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని తనకు నచ్చిన వారికి కారు చౌకగా దేవుడి భూములు కట్టబెట్టేందుకు సిద్దమైంది. దాతలు స్వామివారి నైవేద్యం కోసం ఆలయాలకు విరాళంగా ఇచ్చిన భూములను క్యాబినెట్ ఆమోదం లేకుండా, వేలం నిర్వహించకుండా కావాల్సిన వారికి నేరుగా పందేరం చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సేవా సంస్థల ముసుగులో నచ్చిన వారికి, తోచిన ధరకు ఏకంగా 33 ఏళ్ల పాటు లీజుకు అప్పగించేందుకు ఈ నెల 2న ప్రభుత్వం జీవో నంబర్ 139 విడుదల చేసింది. అంతేకాకుండా ప్రస్తుత లీజు దారులకు మరో 33 ఏళ్లు లీజు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయం న్యాయస్థానాల ఆదేశాలను లెక్కచేయకపోవడమే. దేవాదాయ శాఖ భూములను లీజుకు ఇవ్వాలంటే టెండర్ విధానం ద్వారా బహిరంగ వేలం నిర్వహించి ఎవరు ఎక్కువకు కోట్ చేస్తే వారికివ్వాలి. వ్యవసాయేతర భూములను 33 ఏళ్లకు మించి లీజుకు ఇవ్వకూడదని కోర్టులు గతంలోనే స్పష్టంగా చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దేవాదాయ శాఖ భూములను తన వారికి అప్పనంగా కట్టబెట్టేందుకు న్యాయస్థానాల ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తున్నారు.

**ధార్మిక సంఘాలను సంప్రదించలేదు**

రాష్ట్రంలో దేవాలయాలకు మొత్తం 4.67 లక్షల ఎకరాల భూములుంటే అందులో 87 వేల ఎకరాలు ఇప్పటికే కబ్జా కోరల్లో చిక్కుకుని ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఖరీదైన 4,244 ఎకరాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. రూ. 5 లక్షల విలువ దాటిన పనులను నామినేషన్ పద్దతిన ఇవ్వకుండా గత వైయస్సార్సీపీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటే కూటమి ప్రభుత్వం దానికి తూట్లు పొడుస్తోంది. దేవుడి భూములు లీజుకు ఇవ్వాలంటే వేలం పాట నిర్వహించాల్సి ఉంటుంది. కానీ వేలం లేకుండా రూ. వేల కోట్ల విలువైన భూములను అప్పగించడానికి చట్ట సవరణ చేయడం దుర్మార్గం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ద్వారా ఆలయాలకు తీవ్ర నష్టం జరుగుతుంది. హిందూ సమాజం, ధార్మిక సంఘాలను కనీసం సంప్రదించాలన్న స్పృహ కూడా ఈ ప్రభుత్వానికి లేకుండా చట్టసవరణ చేసేందుకు జీవో ఇస్తూ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. ఈ కుట్రను వైయస్సార్సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. మఠాలు, సత్రాల పేరిట ఉన్న విలువైన భూములను సేవా సంస్థల ముసుగులో ఎలాంటి వేలం లేకుండా ఇచ్చేందుకు జారీ చేసిన జీవో 139ని తక్షణం రద్దు చేయాలి. హిందూ సమాజానికి బ్రాండ్ అంబాసిడర్లంటే దేవాలయాల ఆస్తులను దోచుకోవడమేనా? ఒకవైపు ఆలయాల్లో వరుస అపచారాలు జరుగుతుంటే పట్టించుకోకపోగా మరో వైపు ఆలయాల ఆస్తులనే కాజేసే కుట్రలు చేస్తున్నారు.

## సంపాదకీయం

# పంటల బీమాతో రైతుకు ధీమా


సాగుకు సకల కోటి కష్టాలు అన్నట్టు పొలం దున్ని విత్తనం విత్తినప్పటి నుండి కోత కోసి అమ్మేవరకు అన్నదాత అనునిత్యం ఏదో ఒక సమస్యను ఎదుర్కోవాల్సి వస్తున్నది. అందులో ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలు గురించి చెప్పాల్సిన అవసరం లేదు. మన దేశంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏర్పడి అనేక సార్లు పంటలు నష్టానికి గురై రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు ప్రతి సంవత్సరం పునరావృతం అవ్వడం వల్ల రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. మన రాష్ట్రంలో గత కొన్ని నెలల వ్యవధిలోనే అకాల వర్షాల కారణంగా లక్షల ఎకరాలలో వరి, మామిడి వంటి చేతికి వచ్చిన పంటలు దెబ్బతిని రైతులకు తీవ్రమైన ఆర్థిక నష్టానికి కారణమయ్యాయి. భారతదేశంలో 61% రైతాంగం నికర సాగు విస్తీర్ణంలో సుమారుగా 55% వర్షాధార పంటలు పండిస్తున్నారు. అందువల్ల వర్షాధార వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థ, ఆహార భద్రతకు కీలకమైనది. ప్రస్తుతం ఇది మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దాదాపు 40% వాటా కలిగి ఉంది. వర్షాధార పంటలకు ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్ర నష్టం కలుగుతున్నది. ఈ తరుణంలో ప్రకృతి వైపరీత్యాల నుండి రైతులను రక్షించడం, తదుపరి సీజన్‌కు వారి రుణ అర్హతను నిర్ధారించడం, వ్యవసాయ ఉత్పత్తి, మార్కెటింగ్ వ్యవస్థలో ప్రమాదం, దుర్బలత్వ సమస్యలను ఎదుర్కోవడానికి బహుళ విధానాలను అవలంబించాలి. అందులో పంట బీమా ప్రధానమైనది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వ్యవసాయ బీమాకు తక్కువ డిమాండ్ ఉన్న అంశం. ఎందుకంటే ప్రీమియంలు ప్రతి సంవత్సరం వసూలు చేయబడతాయి. కానీ నష్టపరిహారాలు చాలా అరుదుగా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు మాత్రమే చెల్లించబడతాయి అన్నది సాధారణ రైతు భావన. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు కొన్ని దశాబ్దాలకు పూర్వం నుంచి బీమా పథకాలను అమలు చేస్తున్నాయి. వాటిలో ద్రాక్ష రైతులకు వడగళ్ల బీమా రూపంలో మొదటి పంట బీమా కార్యక్రమం 1820లలో ఫ్రాన్స్, జర్మనీ లాంటి దేశాలలో ప్రారంభించబడ్డాయి. 1883లో అమెరికాలో పొగాకు పంట కోసం ప్రారంభమైంది. అదే విధంగా, అమెరికాలో మొట్టమొదటి బహుళ -ప్రమాద పంట బీమా (ఎంపిసిఐ) 1939లో ఫెడరల్ క్రాప్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏర్పాటుతో ప్రారంభమైంది. మన దేశంలో ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ళు, పంటల పాక్షిక లేదా పూర్తి వైఫల్యానికి దారితీసే వ్యాధులు వంటి వివిధ ప్రమాదాల నుండి వ్యవసాయ సమాజాన్ని బీమా చేయడానికి భారత ప్రభుత్వం గత మూడు దశాబ్దాలుగా అనేక పంట బీమా పథకాలను ప్రవేశపెట్టింది. అందులో 1985లో ప్రారంభించబడిన సమగ్ర పంట బీమా పథకం (సిసిఐఎస్), దేశవ్యాప్తంగా మొట్టమొదటి పథకం. 1999లో సిసిఐఎస్ స్థానంలో జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్ఎఐఎస్) ప్రవేశపెట్టారు. అదే విధంగా, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల నుండి రైతులకు కలిగే నష్టాలను తగ్గించడం కోసం 2007 నుండి వాతావరణ ఆధారిత పంట భీమా పథకాన్ని (డబ్లుబిసిఐఎస్) ప్రారంభించారు. ఆ తర్వాత సవరించిన జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎంఎన్ఎఐఎస్) తీసుకొచ్చారు. 2013- 14లో ఎంఎన్ఎఐఎస్, డబ్లుబిసిఐఎస్‌లను విలీనంచేసి జాతీయ పంట బీమా కార్యక్రమాన్ని (ఎన్‌సిఐపి), ఎన్ఎఐఎస్ స్థానంలో ప్రవేశపెట్టి 2015- 16 వరకు కొనసాగించారు. 2016లో, ఎన్ఎఐఎస్, ఎన్‌సిఐపిల స్థానంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పిఎంఎఫ్‌బివై), పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రస్తుతం అనేక రాష్ట్రాలలో కొనసాగుతున్నది. భారతదేశ జాతీయ పంటల బీమా పథకం అయిన ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన పథకం, రైతుల దరఖాస్తుల సంఖ్య పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద పంటల బీమా పథకం. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన %ఠ% పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత బీమా పథకం (ఆర్‌డబ్లుబిసిఐఎస్) 2016 -17 నుండి 2023 -24 వరకు కలిపి దేశం మొత్తం రైతు దరఖాస్తులు 63.19 కోట్లు కాగా, బీమా చేయబడిన ప్రాంతం 42.21 కోట్ల హెక్టార్లలో బీమా మొత్తం రూ. 17,29,395 కోట్లు. రాష్ట్రంలో 2022- 23లో మొత్తం రైతు దరఖాస్తులు 36.36 లక్షలు కాగా, బీమా చేయబడిన ప్రాంతం 37.83 లక్షల హెక్టార్లు, చెల్లించిన బీమా మొత్తం రూ. 25,529.70 కోట్లు. వ్యవసాయ పంటల బీమా పథకాల పనితీరు మీద భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక- 2017 ప్రకారం మన దేశంలో అమలవుతున్న పంట బీమా పథకాల అమలులో అనేక సమస్యలను ఎదురవుతున్నాయి. అందులో ప్రధానంగా పంటల దిగుబడిపై పంట కోత డేటా, పంట బీమా పథకాల మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫైడ్ ప్రాంతాలలోని అన్ని నోటిఫైడ్ పంటలకు పంట దిగుబడిని అంచనా వేయడానికి అవసరమైన సంఖ్యలో పంట కోత ప్రయోగాలను (సిసిఇ) ప్లాన్ చేసి నిర్వహించాలి. అయితే అవసరమైన దానికంటే తక్కువ పంట కోత ప్రయోగాలను (సిసిఇ) నిర్వహించబడుతున్నాయి. అదే విధంగా, ఒకే భూమిపై బహుళ రుణాలు పొందడం, రైతులు పంటల బీమా ప్రీమియం అధికంగా వున్నాయని భావిస్తున్నారు. క్లెయిమ్ పరిష్కారంలో జాప్యం వంటి అనేక సవాళ్లుగా కొనసాగుతున్నాయి. అంతేకాకుండా, పథకం బీమా చేయబడిన ప్రాంతం విస్తీర్ణం కంటే ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తి, పంట నష్టం, వాతావరణ సమాచారం, పంట ప్రమాద దుర్బలత్వ సూచిక, వాతావరణ ఆధారిత పంట బీమా నమూనాలను అనుసంధానించడం వల్ల అర్హులైన వారందరికీ సరైన సమయంలో పంట బీమాను అందించవచ్చు. అందుకుగాను ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్లు, మానవరహిత వైమానిక వాహనం, రిమోట్ సెన్సింగ్ వంటి మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సకాలంలో, పారదర్శకంగా నష్టం అంచనా వేయడంతోపాటు ఆమోదయోగ్యమైన క్లెయిమ్‌లను సకాలంలో పరిష్కారం కోసం వైఇఎస్‌టిఇసిహెచ్ (టెక్నాలజీ ఆధారిత దిగుబడి అంచనా వ్యవస్థ) 2023 నుండి ప్రవేశపెట్టబడింది. జాతీయ పంట బీమా పోర్టల్, బీమా కంపెనీలు పంట దిగుబడి డేటా/ పంట కోత ప్రయోగాలు, రాష్ట్ర భూమి రికార్డులను లాంటి మొదలగు సమాచారాన్ని ఇవ్వడానికి సిసిఇ -అగ్రియాప్ రూపొందించింది. అదే విధంగా, కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించడం కోసం వాతావరణ సమాచారం, నెట్‌వర్క్ డేటా సిస్టమ్స్ (డబ్ల్యుఐఎన్‌డిఎస్) బ్లాక్ స్థాయిలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు (ఎడబ్ల్యుఎస్), పంచాయతీ స్థాయిలో ఆటోమేటిక్ రెయిన్ గేజ్‌లు (ఎఆర్‌జిఎస్) ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ప్రస్తుతం ఉపయోగించే రిమోట్ సెన్సింగ్, డ్రోన్లు, స్మార్ట్ ఫోన్లు వంటి సాంకేతిక పరిజ్ఞానాలు బీమా చేయబడిన ప్రాంతం, నష్టాల స్థాయి అంచనాలను నిర్వహిస్తున్నప్పటికీ అది ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ఈ తరుణంలో దేశవ్యాప్తంగా ప్రాంతాలవారీగా సంబంధిత ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాలను అంచనా వేయడానికి నూతన సాంకేతిక విధానాలు ఉపయోగించి పంట నష్టాలను ప్రభుత్వ, స్వతంత్ర ఏజెన్సీల ద్వారా కచ్చితంగా అంచనా వేయాలి. అదే విధంగా బీమా చేయబడిన రైతులు, పంట నష్టాల వివరాలను సమగ్ర సమాచారాన్ని నిర్వహించాలి. అంతేకాకుండా బీమా పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు చేరేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట బీమా పథకాల కిందకు పెద్ద సంఖ్యలో రైతులను తీసుకురావాలి. అందుకు ప్రభుత్వాలు తక్కువ ప్రీమియర్లతో పంటల బీమా పథకాలను రైతుల ముందుకు తెచ్చి పంట బీమాలకు సంబంధించిన వివరాలను విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం వల్ల రైతు సోదరులు పంట నష్టాల వల్ల కలిగే ఆర్థిక నష్టాలను పంటల బీమా రూపంలో పొంది ధీమాగా ఉండగలరు

# ధూమపానం... ఆరోగ్యానికి హానికరం



సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క ద్వారా తయారీ వల్ల పొగ విడుదల అవుతున్నందు వలన దీనికి 'పొగాకు' అనే పేరు వచ్చింది. దీని ఆకుల నుండి సిగరెట్లు, చుట్టలు తయారు చేస్తారు. దీనిని కొన్ని రకాల తాంబూలాలలో కూడా ఉపయోగిస్తున్నారు. క్రీస్తు పూర్వం 1400 ఏళ్ల నాడే పొగాకు వాడకం మొదలైంది. ఉత్తర, దక్షిణ అమెరికా ప్రాంతాల్లోని స్థానిక తెగల వారు పొగాకును దేవుని కానుకగా పరిగణించే వారు. వేడుకల్లో పొగ తాగేవారు. పొగాకు చుట్టల నుంచి వెలువడే ధూమ మేఘాల ద్వారా తమ ప్రార్థనలు భగవంతుని చేరుకుంటాయని వారు నమ్మేవారు. యూరోపియన్లు అమెరికాలో అడుగు పెట్టడం ప్రారంభ మయ్యాక క్రీస్తుశకం 16వ శతాబ్దం నాటికి పొగాకు క్రమంగా యూరోపియన్ దేశాలకు, ఆ తర్వాత శరవేగంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బ్రిటిష్ వారి ద్వారా పొగాకు భారత దేశానికి చేరుకుంది. పొగాకు పరిచయం కావడానికి ముందు భారత దేశంలో ఎక్కువగా గంజాయి తోనే పొగ తాగేవారు. ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటు లోకి వచ్చిన తొలినాళ్లలో పొగాకును ఔషధంగా పరిగణించే వారు. సిగరెట్ల కంపెనీలు వైద్యులతో వ్యాపార ప్రకటనలు ప్రచారం చేసుకునేవి. 20వ శతాబ్దిలో సగానికి సగం కాలం ఇలాగే గడిచింది. పొగాకు వల్ల క్యాన్సర్ వంటి అనర్థాలు తలెత్తు తున్నట్లు గుర్తించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సహా పలు అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు పొగాకు వ్యతిరేక ప్రచారం ప్రారంభించాయి. పలు ప్రభుత్వాలు కూడా పొగాకు వాడకంపై ఆంక్షలు అమలులోకి తెచ్చాయి. బొలీవియా మరియు పెరూ పొగాకు జన్మస్థలంగా పరిగణించ బడతాయి. క్రిస్టోఫర్ కొలంబస్ యాత్రల ద్వారా ఐరోపాకు తీసుకు రాబడినట్లు, అలా పొగాకు సాగు క్రమంగా ఉత్తర అమెరికా, చైనా, భారతదేశం, పూర్వ యుఎస్ ఎస్ఆర్ భూభాగంలో, (ట్రాన్స్‌కా కాసియా, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్, మోల్డోవా, ఉక్రెయిన్, క్రిమియా మరియు క్రాస్నోడార్ భూభాగంలో పెంచడం క్రమానుగతంగా జరిగాయి. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం మే 31న ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి ఈ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది.ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పొగ తాగుతున్నారని, ఏటా పొగాకు కారణంగా 70లక్షల మంది మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. 1987లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన సమావేశంలో 1988, ఏప్రిల్ 7న ధూమపాన రహిత దినోత్సవంగా పిలుపు నిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగ దారులను ఏప్రిల్ 7వ తేదీన 24 గంటలపాటు పొగాకు ఉత్పత్తులను వాడకుండా ఉండమని కోరింది. దానిని అనుసరించి 1988లో జరిగిన సమావేశంలో ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది. ప్రపంచం లోనే అత్యధిక శాతం కిరిబాటి దీవిలో మూడింట రెండొంతుల మంది మగవాళ్లు ధూమపానానికి అలవాటు పడ్డారు. మూడొంతుల మంది ఆడవాళ్లు కూడా పొగ తాగుతున్నారు.యూరప్‌లోని మాంటెనెగ్రో దేశంలో 46శాతం మంది ప్రజలకు పొగతాగే అలవాటుంది. గ్రీస్‌లో 50శాతం మంది మగవాళ్లు, 35శాతం మంది ఆడవాళ్లు ధూమపానం చేస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా ఈస్ట్ తైమూర్‌లో 80శాతం మంది మగవాళ్లు పొగ తాగుతారు. కానీ 6శాతం మంది ఆడవాళ్లకు మాత్రమే ఆ అలవాటుంది. రష్యాలో 15ఏళ్ల పైబడిన మగవాళ్లలో 60శాతం మంది పొగ తాగుతున్నారు. 23శాతం మంది మహిళలకు ఆ అలవాటుంది.ఇక తక్కువగా పొగ తాగేవారు ఉండే దేశాలు...ఘనా, ఇథియోపియా, నైజీరియా, ఎరిత్రియా, పనామా... ఈ ఐదు దేశాలూ అతి తక్కువగా పొగ తాగే దేశాల జాబితాలో ముందు వరుసలో ఉన్నాయి. ఆఫ్రికాలో 14శాతం మంది మాత్రమే పొగ తాగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇటీవలి కాలంలో అవగాహన కార్యక్రమాల ఫలితంగా భారత దేశంలో పొగతాగే వారి సంఖ్య 33.8 శాతం నుంచి 23 శాతానికి తగ్గినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. సిగరెట్లు, బీడీలు, సిగార్లు, హుక్కా వంటి ధూమపానం, గుట్కా నమలడం కోసం పొగాకును వివిధ రకాలుగా విక్రయిస్తారు. నికోటిన్ అనేది పొగాకులో ఉండే ప్రధాన విష పదార్థం. ఇది ధూమపానం వ్యసనానికి దారితీస్తుంది. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టమే అధికం. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఊపిరి తిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫిసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయి. మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడుతుంది. గొంతు కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా పీల్చేవారికీ కూడా ప్రమాదమే. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న క్యాన్సర్లు, గుండె జబ్బులు, నాన్-కమ్యూనికెబుల్ వ్యాధులు (ఎన్‌సిడిలు) వంటి దీర్ఘకాల శ్వాసకోశ వ్యాధులు ధూమపానం వలనే సంభవిస్తాయి. పొగాకు తాగేవారు శ్వాస సంబంధిత సమస్యలను కలిగి ఉంటారు ఎందుకంటే, పొగాకు ఊపిరి తిత్తులను పూర్తిగా ప్రమాదానికి గురి చేస్తుంది. అంతేకాకుండా, వీరిలో అధిక శ్లేష్మంతో కూడిన దగ్గు కూడా వస్తుంది. 80% కంటే ఎక్కువ ఊపిరితిత్తుల క్యాన్సర్ మరణాలకు ధూమపానం కారణమని తెలిసింది. సిగరెట్లలో 70కి పైగా హానికరమైన క్యాన్సర్ కలిగించే రసాయనాలు ఉంటాయి.ప్రస్తుత కో విడ్ మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో పొగ త్రాగడం చాలా వరకు తగ్గింది. పొగ తాగడం నేరుగా ఊపిరి తిత్తుల పై ప్రభావం చూపే విషయం వల్ల భయం ప్రధాన కారణం అయితే, లాక్ డౌన్ కట్టుదిట్టమైన చర్యల వల్ల షాపులు ఎక్కువ సమయం మూసి ఉండడం, ఇళ్లనుండి బయటికి వెళ్ళలేక పోవడం ధూమపానానికి ప్రతిబంధకాలుగా మారడం పొగాకు వాడకం తగ్గడానికి కొన్ని కారణాలు.

# ట్రెండ్ సెట్టర్ ఘట్టమనేని కృష్ణ



తెలుగు జాతి గర్వించదగ్గ గొప్ప నటుడు కృష్ణ. నిజానికి తెలుగు చిత్రసీమలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. నట శేఖరుడిగా, సూపర్ స్టార్ గా స్వయం కృషితో తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్న గొప్పతనం ఆయనది. ఎన్టీఆర్ లాగా పౌరాణికాలు, ఏ ఎన్ ఆర్ లాగా సాంఘికాలు, కాంతారావు లాగా జానపదాలు, శోభన్ బాబు లాగా కుటుంబ కథా భరితమైన, ఉదాత్తమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రలలో నటించకున్నా, చిరంజీవి లాగా నృత్యం చేయ లేక పోయినా, ఇవన్నీ పక్కన పెట్టి, మాస్ ఓరియంటెడ్, ఎంటర్టైనర్ కౌబాయ్ జేమ్స్ బాండ్ చిత్రాలలో నటించి, యువతను థియేటర్ బాట పట్టించి, ఎందరికో రోల్ మోడల్ గా నిలిచిన అసాధ్యుడు కృష్ణ. కృష్ణ సాధించింది మామూలు స్టార్ డమ్ కానే కాదు. ఒక సమయంలో ఊరూరా కృష్ణకు రికార్డు స్థాయిలో 2500 అభిమాన సంఘాలు ఉండేవి అంటే అది సామాన్య విషయం కాదు. సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్ట్ పై పట్టు ఉన్న కృష్ణ తెలుగు చిత్ర పరిశ్రమలో చేయని ప్రయోగం లేదు. తెలుగు వెండి తెరకు సరికొత్త ఒరవడులు దిద్దుతూ.. ఆయన పరిచయం చేయని కొత్త ప్రయోగం అంటే అతిశయోక్తి కాదు. కృష్ణ (ఘట్టమనేని శివరామ కృష్ణ మూర్తి) తెలుగు సినిమా నటుడు, దర్శకుడు, నిర్మాత. 1942 మే 31 న గుంటూరు జిల్లా, తెనాలి మండలం తెనాలి పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలోని బుర్రిపాలెం గ్రామస్థులైన ఘట్టమనేని వీర రాఘవయ్య చౌదరి, నాగరత్న దంపతుల పెద్ద కొడుకుగా జన్మించాడు. 1964లో ప్రముఖ దర్శక నిర్మాత ఆదుర్తి సుబ్బారావు అందరూ కొత్తవాళ్లతో తాను తీస్తున్న తేనె మనసులు కోసం కొత్త నటులు కావాలని ఇచ్చిన పత్రికా ప్రకటనకు తన ఫోటోలు పంపించి, పలు వడపోతల తర్వాత ఆదుర్తి సుబ్బారావు ద్వారా కృష్ణను ఇద్దరు కథా నాయకుల్లో ఒకడిగా ఎంపిక కాబడినాడు. అలా తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టిన కృష్ణ నట జీవితం ఉదయం, మధ్యాహ్నం మాత్రమే కాక మూడవ షిఫ్ట్ రాత్రి పది గంటల నుంచి తెల్లవారు జామున 2 గంటల వరకు ఉండేది. చివరికి నిద్ర పోతున్న సమయంలో కాస్ట్యూమ్స్ వేసుకుని పడుకుంటే నిద్రిస్తున్న సన్నివేశాలు చిత్రీకరిం చుకున్న సందర్భాలు ఉన్నాయి. 1968లో కృష్ణ నటించిన 10 సినిమాలు, 1969లో రికార్డు స్థాయిలో 19 సినిమాలు, 1970లో 16 సినిమాలు, 1971లో 11 సినిమాలు, 1972లో 18 సినిమాలు, 1973లో 15 సినిమాలు, 1974లో 13 సినిమాలు, 1975లో 8 సినిమాలు విడుదల కావడం గమనార్హం. 1972లో ఒకే ఏడాది 17 సినిమాలను విడుదల చేసి రికార్డు సృష్టించాడు. ప్రపంచంలో మరే సినీ నటుడికీ ఇలాంటి రికార్డు లేదు. తెలుగులో "తొలి జేమ్స్ బాండ్ సినిమా" (గూఢచారి 116), తొలి "కౌబాయ్ సినిమా" (మోసగాళ్లకు మోస గాడు), తొలి "ఫుల్ స్కోప్ సినిమా" (అల్లూరి సీతారామ రాజు), "తొలి 70 ఎంఎం సినిమా" (సింహాసనం) వంటివి సూపర్ స్టార్ కృష్ణ సినిమాలే. తెలుగులో సాంకేతికం గానూ పలు తొలి తెలుగు సినిమాలు కృష్ణవే. కొల్లేటి కాపురంతో తెలుగులో ఆర్.ఓ. సాంకేతికత పరిచయం చేశారు. మొదటి ఓఆర్‌డబ్ల్యు కలర్ సాంకేతిక తతో తీసిన సినిమా గూడుపు ఠాణి. తొలి తెలుగు ఫ్యూజీ కలర్ చిత్రం భలే దొంగలు. తెలుగులో 70 ఎంఎం సాంకేతికత ఉపయోగించిన తొలి సినిమా సింహాసనం. సింహాసనం సినిమా స్టీరియోఫోనిక్ 6 ట్రాక్ సాంకేతికతతో సౌండ్ టెక్నాలజీ వాడిన తొలి తెలుగు సినిమా. అల్లూరి సీతారామరాజు తెలుగులో ఫుల్‌స్కోప్ సినిమాల్లో మొదటిది. బాక్సాఫీస్ రికార్డుల పరంగా చూస్తే, మద్రాస్ నగరంలో వంద రోజులు పూర్తిచేసుకున్న తొలి తెలుగు చిత్రంగా చీకటి వెలుగులు, హైదరాబాద్ నగరంలో ఏడాది పాటు ఆడిన తొలి తెలుగు సినిమాగా అల్లూరి సీతారామరాజు నిలిచిపోయాయి. 1982లో భవనం వెంకట్రామ్ ప్రభుత్వం హైదరాబాద్లో పద్మాలయా సంస్థకు స్టూడియో నిర్మించు కోవడానికి జూబ్లీ హిల్స్ లో 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వగా, 1983 నవంబరు 21న నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు చేతుల మీదుగా పద్మాలయా స్టూడియోస్ ప్రారంభింప చేసుకుని కృష్ణ స్టూడియో యజమాని అయ్యారు.స్వంత నిర్మాణ సంస్థ పద్మాలయా పిక్చర్స్ ద్వారా 1971లో తీసిన మోస గాళ్లకు మోసగాడు మాత్రం భారీ విజయాన్ని, సాహసిగా కృష్ణకు పేరును తెచ్చి పెట్టింది. మోస గాళ్లకు మోసగాడు సినిమా ఆంగ్లం లోకి ట్రెజర్ హంట్ పేరిట అనువాదమై 123 దేశాల్లో విడుదలైంది, మంచి విజయాన్ని సాధించింది. కృష్ణకు 1997లో ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం, 2003లో ఎన్టీఆర్ జాతీయ పుర స్కారం, 2008లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 2009లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం వంటి గౌరవాలు లభించాయి. ఆస్ట్రేలియా ప్రభుత్వం కృష్ణను గౌరవిస్తూ ఓ పోస్టల్ స్టాంప్ కూడా విడుదల చేసింది. 1976లో కేంద్ర కార్మిక శాఖ మంత్రి కె.వి.రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా కృష్ణ "నటశేఖర" బిరుదును అందుకున్నాడు. 1972లో జైఆంధ్ర ఉద్యమం జరిగినప్పుడు కృష్ణ ఆ ఉద్యమానికి బహిరంగంగా మద్దతు నిచ్చాడు. 1984 అక్టోబరులో ఇందిరా గాంధీ దారుణహత్యకు గురైనప్పుడు కృష్ణ ఆమె అంత్యక్రియలకు ఢిల్లీ వెళ్ళి, రాజీవ్ గాంధీని కలవడం జరిగింది. అలా 1984లో కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. 1989లో కృష్ణ కాంగ్రెస్ తరఫున ఏలూరు లోక్‌సభ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించాడు. 2009 ఎన్నికల్లో వై.ఎస్.రాజశేఖర రెడ్డి కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీకి కృష్ణ కుటుంబం నైతిక మద్దతు అందించింది. కరువు బాధితుల సహాయ నిధికి సినిమా తారల యాత్ర పేరుతో 1972 అక్టోబరు 28 నుంచి నవంబరు 2 వరకు విజయవాడ, తెనాలి, గుంటూరు, రాజమండ్రి, హైదరాబాద్ లలో తోటి నటీనటులు, సాంకేతిక నిపుణులను కూడగట్టి కార్యక్రమాలు నిర్వహించాడు. వచ్చిన డబ్బు సహాయ నిధికి అందించారు. ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు, పద్మాలయా స్టూడియో అధినేత, మాజీ ఎంపీ, సూపర్‌స్టార్ కృష్ణ (80) 2022 సంవత్సరం నవంబర్ 15న కార్డియాక్ అరెస్టుకు గురై, ఆసుపత్రికి తరలించబడి చికిత్స పొందుతూ తనువు చాలించి, ఆయన తుదిశ్వాస విడిచి, అశేష అభిమానులను శోక సంద్రంలో ముంచి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు.

## పాలకొల్లుకు ఎనలేని కీర్తి ప్రతిష్టలు అందించిన

# దర్శక రత్న దాసరి చిరస్మరణీయులు

**పాలకొల్లులో ఘనంగా జరిగిన దాసరి నారాయణరావు 8 వ వర్ధంతి**



**పాలకొల్లు. ప్రజాజ్యోతి (కొట్టి రామం ) మే 30.** తెలుగు సినీ పరిశ్రమలో దర్శకుడిగా అత్యధిక సినిమాలు తీసి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సృష్టించి పాలకొల్లు కీర్తి ప్రతిష్టలను ప్రపంచం నలుమూలలా వ్యాపింపజేసిన దర్శక రత్న దాసరి నారాయణరావుని చిరస్మరణీయులని దాసరి విగ్రహ నిర్మాణ కమిటి ప్రధాన సలహాదారు వంగా నరసింహారావు అన్నారు. దాసరి కాంస్య విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో దాసరి 8వ వర్ధంతిని పాలకొల్లు కెనాల్ రోడ్ లో ఉన్న దాసరి కాంస్య విగ్రహం వద్ద నిర్వహించారు. తొలుత దాసరి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. దాసరి కాంస్య విగ్రహ నిర్మాణ కమిటీ కార్యదర్శి, శ్రీ కృష్ణదేవరాయ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు యర్రంశెట్టి వెంకటరత్నం మాట్లాడుతూ దర్శకులు దాసరి తెలుగుసినీ పరిశ్రమను మద్రాసు నుండి హైదరాబాద్ కు రప్పించారని తెలుగు సినీ పరిశ్రమకు దాసరి గాడ్ పాదర్ అయ్యారని అన్నారు. పాలకొల్లు నుండి ఎందరో సినీ దర్శకులను చిత్ర పరిశ్రమకు అందించిన గురువు దాసరి అని కొనియాడారు. పాలకొల్లు పరిసర ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన , మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు, నరసాపురం -నిడదవోలు కాలువపై వంతెన నిర్మాణం వంటి ప్రజలకు ఉపయోగకరమైన పనులను దాసరి చేశారన్నారు. వక్తగా,నటుడిగా,రచయితగా, నిర్మాతగా, దర్శకుడిగా, తెలుగు సినీపరిశ్రమను ఏలిన బహుముఖ ప్రతిభాశాలి దాసరి నారాయణ రావు దేశభాషలందు తెలుగు లెస్స అని ప్రపంచానికి చాటి చెప్పిన శ్రీ కృష్ణ దేవరాయలకు నిజమైన వారసుడు డాక్టర్ దాసరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేడికొండ శ్రీనివాసరావు చౌదరి రసధుని అధ్యక్షులు కొట్టి భాస్కరరావు, నటీనట సంక్షేమ సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు గుడాల హరిబాబు పి.టి.వెంకటేశ్వరరావు,గంధంశ్రీనివాస్ పుత్సల నాగలింగేశ్వరరావు, జక్కంపూడి మదన్, కానూరి బాబు, జి ఎస్ ఎన్ మూర్తి, ఇనుకొండ శేషాద్రి, రాయి సూరిబాబు, గుండుమోగుల వీరాస్వామి, చుండూరి రంగయ్యనాయుడు, శివాల రామారావు , ముచ్చర్ల సత్యనారాయణ, యాతం రమేష్, మండేల ఫణి, జి ఎస్ ఎన్ రవి, గంధం యేసుపాదం, కోలాటిపెద్దిరాజు, యర్రంశెట్టి రతన్ జీ, సుంకర గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ఘనంగా వైట్ గోల్డ్ షోరూమ్ ప్రారంభం...





**ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు..**

**మే 30, తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** బంగారాన్ని నగదు రూపంలోకి మార్చుకోవాలనుకునే వారు వైట్ గోల్డ్ సంస్థను సంప్రదించాలని సంస్థ సేల్స్ హెడ్ మిథున్ శెట్టి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో మూడవ షోరూమ్ ను తిరుపతి లో ప్రారంభించారు.. తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు లోని స్మార్ట్ బజార్ ఎదురుగా వైట్ గోల్డ్ సంస్థ కార్యాలయంను శుక్రవారం స్థానిక శాసన సభ్యులు అరణి శ్రీనివాసు ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యే కి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం గోల్డ్ లోన్ సంస్థలు చాలా ఉపయోగంగా ఉన్నాయని తెలియజేశారు. ప్రజలు కూడా వైట్ గోల్డ్ సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్థ సేల్స్ హెడ్ మిథున్ శెట్టి, సేల్స్ మేనేజర్ సల్మా లు మాట్లాడుతూ పాత మరియు వాడకానికి లేని బంగారు ఆభరణాలను కొనుగోలు చేయడంలో వైట్ గోల్డ్ నిపుణత కలిగిన సంస్థ అని తెలిపారు. కేవలం 30 నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తి చేసి తక్షణమే నగదును అందిస్తుందన్నారు. 2017 లో బెంగుళూరులో ప్రారంభమైన వైట్ గోల్డ్ సంస్థ అంచెలంచెలుగా విస్తృతం చేస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజల నుంచి వచ్చిన అభ్యర్ధనల మేరకు విజయవాడ గుంటూరు తిరుపతి నగరాల్లో షోరూమ్ లను ప్రారంబించామన్నారు. ఆర్థిక అవసరాల సమయంలో బంగారం విక్రయించదలచిన వారికి గౌరవ ప్రదమైన పద్ధతులతో కూడిన తేలికపాటి మార్గాన్ని అందించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చామన్నారు. చెల్లింపుల ప్రక్రియలో అత్యున్నత స్థాయి నమ్మకాన్ని నిర్ధారించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సిఐటియు 55వ ఆవిర్భావ దినోత్సవం



**గుంతకల్లు మే 30 (ప్రజా జ్యోతి):** సిఐటియు 55 వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని గుంతకల్లు సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద సిఐటియు సీనియర్ నాయకులు కామ్రేడ్ ఎస్కేయం.భాషా సిఐటియు జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ 1970 సిఐటియు సంఘం ఏర్పడింద ని,ఇప్పుడు 55 సంవత్సరాలు అయ్యిందని, అప్పటి నుంచి ఇప్పటిదాకా కార్మికుల హక్కులకై నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం సిఐటియు అని, 1975లో వచ్చిన కార్మిక వ్యతిరేక ఎమర్జెన్సీని సిఐటియు వ్యతిరేకించిందని తెలిపారు.1978 లో జనత ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక సంబంధాల బిల్లు సమ్మెలను అనేక రంగాల్లో నిషేధించిందని,కార్మికుల హక్కుల కు అడ్డుకట్టు వేసింది ఈ బిల్లుకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ కూడగట్టి బిల్లును చెత్తబుట్టిలో వేయించిందని, అలాంటి నిరంతర పోరాటాల తో కార్మికులతో ఐక్యమై నిరంతరం పోరాటం చేస్తున్న దేశంలో ఏదైనా కార్మిక సంఘం ఉందంటే అది ఒక సీఐటీయూ నేనని తెలిపారు.కార్మికుల ఐక్యం చేయడంలో సిఐటియు పాత్ర ఎంతో కృషి ఉందని, పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని,నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసేంతవరకు సిఐటియు కార్మిక సంఘం పోరాడుతుందని. జూలై 9 న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మికుల సంఘం కార్యదర్శి తేజ్,సూరి,ఉసేన్ పీర, పీరా, లావణ్య,ఆటో యూనియన్ నాయకులు మోహన్ కుమార్, వనూరప్ప,తదితరులు పాల్గొన్నారు.

# శెట్టిపల్లి భూముల సమస్య త్వరలోనే పరిష్కరిస్తాం.


**భూములు పరిశీలించిన తుడా చైర్మన్, ఉపాధ్యక్షులు.**





**మే 30,తిరుపతి జిల్లా ప్రతినిధి, (ప్రజాజ్యోతి)** శెట్టిపల్లి. భూముల సమస్యలను త్వరలోనే పరిస్కస్తామని తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శెట్టిపల్లి భూములను చైర్మన్ సి.దివాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య తుడా, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కృతంగా ఉన్న శెట్టిపల్లి భూముల పరిష్కారానికి అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. గత 10 సంవత్సరాలుగా రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రైతులకు , సైట్లు కొనుగోలు చేసిన వారికి ఎక్కడ ఇవ్వాలనే విషయాలపై చర్చిస్తున్నామని అన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే సర్దుకుని ముందుకు వెళ్లేందుకు సహకరించాలని అన్నారు. వేల కుటుంబాలు ఆధారపడి ఉన్న శెట్టిపల్లి భూములను అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రభుత్వం తరపున ఈ భూములను అభివృద్ధి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో త్వరగా రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించి, మహా నగరంగా తీర్చిదిద్దనున్నామని అన్నారు. తుడా తరపున ఇంత త్వరగా అభివృద్ధి చేశారా అనేలా చేస్తామని అన్నారు. ఈ పరిశీలనలో తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి , ఉద్యానవన శాఖాధికారి మాలతి, సర్వేయర్లు దేవానంద్, కోటేశ్వర రావు, పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## శ్రీశ్రీశ్రీ లక్ష్మీ మద్దిలేటి స్వామి వారి దర్శించిన తలారి పరుశురాముడు కుటుంబ సభ్యులు



**గుంతకల్లు మే 30 (ప్రజా జ్యోతి):** కర్నూలు జిల్లాలోని రంగాపురం శ్రీశ్రీశ్రీ లక్ష్మీ మద్దిలేటి స్వామి వారి దర్శించిన కసాపురం శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవస్థానం వ్యవస్థాపకులు ధర్మకర్తలు తలారి పరుశురాముడు,శకుంతలమ్మ కుటుంబ సభ్యులు తలారి రామ్ చరణ్ తేజ,సౌమ్య,గగన దీపిక,ఇంజనీర్ తలారి రాజశేఖర్ దర్శించారు.వీరికి ఆలయ ఏవో రామాంజనేయు లు నేతృత్వంలో సాధారణ స్వాగతం పలుకుతూ శ్రీ లక్ష్మీ మద్దిలేటి స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు కుంకుమార్చన సేవలు నిర్వహించడం జరిగినది. అనంతరం పరశురాముడు మాట్లాడుతూ ఈరోజు శ్రీ లక్ష్మి మద్దిలేటి స్వామి వారిని దర్శించడం మా భాగ్యంగా భావిస్తూ గత కొన్ని సంవత్సరాలుగా స్వామి అమ్మవారిని దర్శించడం జరుగుతుందని అన్నారు. అలాగే ఆలయ ఈవో రామాంజనేయులు ఆలయ సిబ్బంది అర్చకులు అందరికీ తలారి పరశురాముడు ధన్యవాదాలు తెలియజేస్తూ శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆశీస్సులు మీకు మీ కుటుంబానికి ఉండాలని, అందరూ కసాపురం దేవస్థానం కు రావాలని కోరడం జరిగింది. శ్రీ లక్ష్మీ మద్దిలేటి స్వామి ఆలయ సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం: మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్




**గుంతకల్లు మే 30 (ప్రజా జ్యోతి):** సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ప్రజలకు తెలిపారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 2025 జూన్ 5 తేదీ లోపల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించాల్సినటువంటి స్పెషల్ కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం గుంతకల్లు పురపాలక సంఘం పాత గుత్తి రోడ్డు వెజిటబుల్ మార్కెట్ ఏరియా నందు సింగిల్ యూస్ ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవలసినటువంటి వివిధ రకాల చేతి సంచులు క్యారేజీ బాగలు జనుమునార తో చేసినటువంటి సంచులు క్లాత్ కవర్లు వాడాలని ప్రజలలో అవగాహన కల్పించడం కోసం ప్రదర్శించడం జరిగినది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ నిర్వహణపై సీఐ పలు సూచనలు





**నందిగామ, మే 30 - ప్రజాజ్యోతి** బక్రీదు పండుగ రోజున ముస్లిం సోదరులు ఇతర మతాల ను గౌరవిస్తూ తమ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని సిఐ వైవిఎల్ నాయుడు కోరారు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ముందుగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇతర మతాల గౌరవాన్ని కూడా కాపాడుతూ తమ పండుగను నిర్వహించుకోవాలని కోరారు హిందూ మతానికి దైవంగా భావించే గోవులను వధించ కుండా తమ పండుగ నిర్వహించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మత పెద్దలు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## విత్తనాల దుకాణాలలో స్టాక్ బోర్డులు తప్పనిసరి

**విత్తనాలు కొనేటప్పుడు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలి**

**ఎమ్మార్పీ ధరల మించి అమ్మితే కఠిన చర్యలు తప్పవు**

**-విజయ్ కుమార్**



కంచికచర్లలో ఉన్న విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. డూప్లికేట్ విత్తనాలు లేదా ఇతరత్రా అనధికారికంగా విత్తనాలు నిల్వ చేశారా లేదా స్టాకు రిజిస్టర్లు విత్తనాలు స్టాకు సక్రమంగా ఉన్నాయా లేవా అని పరిశీలించారు. స్టాకు రిజిస్టర్ లో నిల్వ ఉన్న స్టాకు అన్ని సక్రమంగానే ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు స్టాకు బోర్డు ఉండాలి, పత్తి, మొక్కజొన్న, పెసలు, కందులు, మినుములు ఇతర విత్తనాలు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే విత్తనాలను అమ్మాలని అత్యధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి హెచ్చరించారు. రైతులు విత్తనాల దుకాణాల్లో కొనేటప్పుడు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని , ఎమ్మార్పీ రేట్లు కన్నా ఎక్కువ అమ్మితే విత్తనాల దుకాణాలపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

# అరకు ఎమ్మెల్యే ఫిర్యాదులో వాస్తవం ఉంది.

## (ఇదే కబ్జా కాబడిన ప్రభుత్వ భూమి)







**అనంతగిరి మే. 30. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్. శంకర్.** ప్రభుత్వ భూముల కబ్జాకు నిలయంగా మారింది బీం పోలు పంచాయితీ. అరకు నియోజకవర్గం వైయస్సార్ పార్టీ ఎమ్మెల్యే రేగ మత్య లింగం ఆవేదన. బాధ. తపన.గిరిజన ప్రజల కోసమే అందుకే ఈ భూ పోరాటం. అల్లూరి జిల్లా. అనంతగిరి మండలం భీం పోలు పంచాయితీ పరిధి.సరియాపల్లి రెవెన్యూ రామచంద్ర పురం గ్రామానికి సమీపాన సర్వే నంబర్ 27. లో మూడెకరాల 68.సెంట్లు ప్రభుత్వ భూమి నీ బరిజననగేష్ అనే భూ వ్యాపారి ఆక్రమించి భూ కబ్జాకు పాల్పడి బుల్డోజర్ తో భూ చదును పనులు ప్రారంభించి ప్లాట్లుగా విభజించి అమ్మకాలు జరుపుతున్నట్లు స్థానికులు సమాచారం.ఇదే వ్యాపారిపై అరకు ఎమ్మెల్యే రెండు రోజుల క్రితం అల్లూరి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసిన సంగతి నియోజకవర్గ ప్రజలకు తెలిసిందే. అయినప్పటికీ తగు చర్యలు లేకపోవడం వలన.మరల రామచంద్రపురం గ్రామానికి దగ్గరలో ఉన్న భూమిని కబ్జా చేసి పనులు చేస్తున్నారని సమాచారం. ఇది ఇలాఉండగా ప్రభుత్వ భూమి కబ్జాపై కొన్ని నెలల క్రితం స్థానికులు రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేయడంతో.రెవెన్యూ సిబ్బంది పర్యటించి స్థలాన్ని పరిశీలించి వెంటనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. రెవెన్యూ శాఖ హెచ్చరికను పక్కనపెట్టి మరల భూమిని నగేష్ స్వాధీనం చేసుకున్నాడని గ్రామస్తుల సమాచారం. ఇలాంటి వ్యక్తులపైనే ఎమ్మెల్యే భూ పోరాటం చేస్తున్నారని ప్రజలు అంటున్నారు.

# భారతీయులందరు ఐక్యంగా కలిసి ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలి








బిజెపి మతన్మాదాన్ని రెచ్చగొట్టడం దారుణం సమైక్యతా యాత్రలో పాల్గొని మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం.

**పోడూరు /ఆచంట.మే 30,ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** ఉగ్రవాదం మతోన్మాదం యుధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోని లౌకికతత్వం మతసామరస్యాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. మతసామరస్య దేశ సమగ్రత పరిరక్షణకు సిపిఎం చేపట్టిన సమైక్యత యాత్ర శుక్రవారం సాయంత్రం ఆచంటలో ఉత్తేజ భరితంగా సాగింది. స్థానిక రామేశ్వర స్వామి సత్రం నుంచి ఆచంట కచేరి సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఉగ్రవాదం మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అధ్యక్షతన వహించారు. ఈ సభను ఉద్దేశించి సీతారాం మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవలసిన సమయంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తుందన్నారు. దాని పర్యసానంగా ఇటీవల కాలంలో ముస్లింలపై 112 దాడులు జరిగాయని అన్నారు.పహాల్గాం ఉగ్ర దాడి జరిగిన సమయంలో మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారని అటువంటి వారికి అభినందనలు తెలపవలసిన ప్రధాని తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సింధూ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించామని చెబుతున్నారని, గతంలో సర్జికల్ స్ట్రైక్ పేరుతో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారని వారు ఇప్పటి ఉగ్రవాదులు ఎక్కడినుంచి వచ్చారని సీతారాం ప్రశ్నించారు. అత్యంత అహ్లాదకర ప్రాంతమైన పహాల్గాం లోకి ఉగ్రవాదులు ఎలా సొరబడ్డారు కేంద్రం ఇప్పటివరకు బయట పెట్టలేదు అన్నారు. వారిని పట్టుకోలేదని పైగా ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన సోఫియా ఖురేషియాని ఉగ్రవాదుల సోదరిగా బిజెపి నాయకులు వర్ణించడం అత్యంత సిగ్గుచేటన్నారు. దాన్నికప్పుపుచ్చుకు నేందుకు మోడీ సోఫియా కుటుంబ సభ్యులతో ప్రదర్శన జరిపి రాజకీయం చేశారని ఆయన దుయ్యబడ్డారు . బిజెపికి మద్దతు ఇస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ముస్లింలు పాకిస్తాన్ కు వెళ్ళిపోవాలంటూ ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతున్నారని విమర్శించారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం సరికాదన్నారు. లౌకిక పార్టీ అని చెప్పుకుంటున్న టిడిపి కూడా దీనికి సమాధానం చెప్పాలన్నారు. సిపిఎం దేశంలో సమైక్యతకు కట్టుబడి ఉందని అన్నారు. ఆపరేషన్ సింధూరిని ఆపేస్తున్నారని ప్రకటన చేయడానికి ట్రంపు ఎవరని సీతారాం ప్రశ్నించారు. బిజెపి నాయకుల తీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. సైనికులు ప్రజలు మోడీ కాళ్లకు దండం పెట్టాలని చెబుతున్నారని ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో యుద్ధ వాతావరణం పెరగడానికి పాలకుల తీరే కారణమన్నారు. ప్రజలంతా శాంతి సామరస్యాలతో జీవనం సాగించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మతసామ రస్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూపాటుపడాలన్నారు. సమగ్రత సమైక్యతను కాపాడుకునేందుకు మేధావులు కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి మోహన్ రావు, కాకర వెంకటేశ్వర్లు, షేక్ పాదుషా, తలుపూరి బుల్లబ్బాయి, సిర్రా నరసింహమూర్తి, మచ్చ సుబ్బారావు,ఎస్ వి ఎన్ శర్మ , పిల్లి చంటిబాబు, గుత్తుల రంగారావు, బండి రంగారావు, దుర్గారావు బాలాజీ, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, ఉన్నమట్ల పండు సరళ్ళ బాలకృష్ణ , కొండేటి సత్యనారాయణ, పోడూరు, పెనుగొండ పార్టీ నేతలు, సానుభూతి పరులు తదితరులు పాల్గొన్నారు.

# పాత మున్సిపల్ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ



**బద్వేల్ మే 30 (ప్రజాజ్యోతిన్యూస్)** స్థానిక పట్టణంలో శుక్రవారం నాడు సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించిన సిఐటియు నాయకులు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) మే 30 1970 సంవత్సరంలో కలకత్తా నగరంలో" ఐక్యత బిపోరాటం" అనే నినాదంతో ఆవిర్భవించడం జరిగిందని, ఇప్పటికీ 55 సంవత్సరాలు పూర్తిచేసుకుని 56వ సంవత్సరం లోకి సిఐటియు అడుగు పెట్టిందన్నారు. 55 సంవత్సరాల పాటు కార్మికుల హక్కుల కోసం కార్మికుల శ్రేయస్సు కోసం రాజీలేని పోరాటాలు ఎన్నో దేశవ్యాప్తంగా చేశారన్నారు . దేశంలో ఏ కార్మికుడికి సమస్య వచ్చినా సిఐటియు అగ్రభాగాన నిలబడిందన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చేసే దానికోసం నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చిందన్నారు . 29 లేబర్ చట్టాలను కుదించి 4 లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికుల పైన మరింత పని భారం మోపే దానికోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ,రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు .కార్మికులకు సిఐటియు ఎర్రజెండా ఎప్పటికీ కార్మికులకు అండగా ఉంటుందన్నారు .లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. జులై 9 వ తారీఖున దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని సమ్మె చేస్తున్నామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులను మతం పేరుతో విభజిస్తుందన్నారు. కార్మికులు, కర్షకులు, రైతులు ఐక్యమైతే భారతదేశంలో బిజెపి నామరూపం లేకుండా పోతుందనే భయంతో ఈ విధంగా కార్మికుల మధ్య ఐక్యత లేకుండా చేస్తున్నారని తెలిపారు. కార్మికులు ఎప్పటికైనా ఐక్యం కాక తప్పదన్నారు.లేబర్ కోడ్స్ తిప్పి కొడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, పట్టణ నాయకులు హరి, సత్యరాజు అట్లూరు నాయకులు రమణయ్య,రవి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు




**మే 30, తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** స్థానిక తిరుచానూరు శిల్పారామంలో శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గురు ఆర్. కార్తిక్ నాయక్, అక్షర వేదసి ట్యూషన్ సెంటర్,నారాయణ పురం, తిరుపతి వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గణనాయకాయ అంటూ సాగే ఈ పాటతో మొదలై నటాషా కౌర్త్యం, వాతాపి గణపతిం, పుష్పాంజలి, మేరే దోల్నా, నమః నమో నమః శివాయ, భద్ర శైల రాజమందిర, భువనలోకమున తదితర పాటలకు కళాకారులు జీవన, ప్రియాంక, హేమన్విత, మోక్తిక, రోషిత, శనన్య, వేద ప్రసన్న, పర్ణిత, రుదీర, వర్షిణి, తన్వి, భానుశ్రీ, తదితరులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏ .ఓ సుధాకర్ పర్యవేక్షించారు. అనంతరం కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు కార్తిక్ నాయక్ , సిబ్బంది పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ 600 చెల్లించాలి

## ఏపీ వ్య. కా. సం. డిమాండ్.



పోడూరు /పెనుగొండ, మే 30,ప్రజాజ్యోతి న్యూస్. (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్). పెరుగుతున్న ధరల కనుగుణంగా ఉపాధి హామీ వేతనాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పెనుగొండ మండల నాయకుడు ఎస్కే పాదుషా అన్నారు. శుక్రవారం చిన్న మల్లం గ్రామంలో ఉపాధి పని చేస్తున్న కార్మికులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2025వ సంవత్సరానికి కనీస వేతన చట్టం ఆధారంగా ఉపాధి హామీ పథకంలో వేతనాన్ని సమీక్షించి కనీస వేతనం రూ 600/- ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పనికి కొలత ఆధారంగా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని శ్రమకు తగిన వేతనం చెల్లించడం లేదని అన్నారు. వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వాలు కనీస వేతనం చట్టం ఆధారంగా రూ 600/- చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ప్రమాద బీమాకు రూ 20 రూపాయలు చెల్లించాలని కట్టించడం అన్యాయం అన్నారు. కొన్నిచోట్ల అదనంగా భీమా రుసుము రూ 30/- చొప్పున కార్మికుచే కట్టించుకుంటున్నారని అన్నారు. కనుక ప్రమాద బీమా రుసుము ప్రభుత్వమే కార్మికుల పక్షాన ఉచితంగా చెల్లించి నేరుగా సహజ మరణానికి రూ రెండు లక్షలు, ప్రమాద మరణానికి రూ 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, ఉపాధి కార్మికులు, మేట్లు పాల్గొన్నారు.

## రాణి అహల్య భాయి 300 వ జయంతి వేడుకలు



**బేతంచెర్ల: మే 30 (ప్రజా జ్యోతి)** బేతంచెర్ల పట్టణంలోని బీజేపీ కార్యాలయం లో శుక్రవారం సాయంత్రం రాణి అహల్య భాయి 300 వ జయంతి వేడుకలు శుక్రవారం జరగాయి , బేతంచెర్ల బీజేపీ మండల అధ్యక్షులు దాదిగాళ్ళ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి లెక్చరర్ హరి ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నాగ మోహన్ రెడ్డి మాట్లాడుతూ... 18 వ శతాబ్దంలో రాణి అహల్య భాయి 30 సంవత్సరాల పరిపాలన కాలంలో కాశీ, అయోధ్య, గయా, మధుర, అవంతి, కాంచి, హరిద్వార్, ద్వారక, భద్రీనాథ్, రామేశ్వర తదితర క్షేత్రములలో హిందూ దేవాలయలను పునఃరుద్దరించడమే కాకుండా నీటిబావులను, చెరువులను అభివృద్ధి చేసి హిందూధర్మ చేసిన ఏకైక వీరనారి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, న్యాయవాది నందిపల్లె నారాయణ, ధర్మప్రచారక్ బాలీశ్వర రెడ్డి, సముద్రాల మణికంఠ, సుధాకర్, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

## హెచ్.ఎం నారాయణ రెడ్డి



**బద్వేల్ మే 30 (ప్రజాజ్యోతిన్యూస్)** బద్వేల్ నియోజకవర్గం లోని కాశినాయన మండలం గొంటువారిపల్లె గ్రామములో శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్ బి.నారాయణరెడ్డి, టీడీపీ యువ నాయకులు కొండా రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలసి క్యాంపెయినింగ్ నిర్వహించారు. గ్రామములోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారి ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలలో జరిగే బోధన పద్ధతుల గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం మెనూ గురించి తల్లిదండ్రులకు వివరించారు. మన పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం బోధన కూడా ఉందన్నారు. మా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిస్తామని తల్లిదండ్రులు సానుకూ లంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి. వెంకటరెడ్డి,ఎస్.కిరణ్ కుమార్, ఏ.నరసింహారెడ్డి,యమ్.ఐ.ఎస్ క్వార్డినేటర్ పి. దస్తగిరి, పాఠశాల చైర్మన్ ఓబయ్య, టీడీపీ యువ నాయకులు గణితం విశ్వనాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులకు లాభసాటి వ్యవసాయం అందించటమే కూటమి ప్రభుత్వం ఉద్దేశ్యం





**పోడూరు /ఆచంట, మే 30,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** రైతుకు లాభసాటి వ్యవసాయం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికసిత కిసాన్ సంకల్ప అభియాన్ ముఖ్య ఉద్దేశమని మాజీ మంత్రి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కొడమంచిలి రైతు భవనంలో శుక్రవారం వికసిత కిసాన్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ 1.5 కోట్ల మంది రైతులకు 700 జిల్లాలలో2 వేల బృందాలు అవగాహన చేసేందుకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతుకు నికర ఆదాయం వచ్చేలా వరి వంగడాలను సాగు చేసి చీడపీడల నివారణకు రైతుల శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు సలహాలతో ముందుకు వెళ్లాలని రైతులను సూచించారు.గత ఐదేళ్ల ప్రభుత్వం నీటి ఎద్దడి ఉన్నప్పటికీ పట్టించుకోలేదని ఏడాది కాలంలో నీటి ఎద్దడి అధిగమించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సాగు చేయడం వల్ల ఖర్చు తగ్గించుకోవచ్చునని అన్నారు. విత్తనాలు విత్తడం దగ్గర నుండి వ్యవసాయ యాంత్రీకరణతో గణనీయంగా ఖర్చులు తగ్గుతాయన్నారు. రైతులు విశిక్షణారహితంగా ఎరువులు పురుగుమందులు వాడటం కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించుకునే ప్రజలకు వ్యాధులు బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశాల్లో బ్యాన్ చేసిన రసాయనాలు భారతదేశంలో వినియోగించడం జరుగుతుందని వీటిని అరికట్టవలసిన బాధ్యత రైతులపై ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు పండించిన పంటకు ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే సొమ్ము జమ చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసి రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు సలహాలు అందించాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలు సక్రమంగా ఫిర్యాదులు అందుతున్నాయని నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.కృషి విజ్ఞాన కేంద్రం ,ఉండి అధిపతి డా. ఎన్. మల్లికార్జునరావు,డా. వై. సుబ్బయ్య ప్రధాన శాస్త్రవేత్త ఎన్ఐఆర్ సిఏ,డా. పి. సహదేవరెడ్డి ఏడిఆర్, ఆర్ ఏ ఆర్ ఎస్ మార్టేరు, ఇతర శాస్త్రవేత్తలు వరి పంటలో అనువైన రకాలు, మేలైన యాజమాన్య పద్ధతులు చీడపీడల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో చర్చ గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు కేత మీరయ్య, వైస్ ఎంపీపీ నాగరాజు, పాలకొల్లు ఏడీఏ అడ్డాల పార్వతి, ఉద్యానవనాధికారిణి ఎన్.ప్రియ దర్శిని,మండల వ్యవసాయాధికారి బి. నాగరాజు ,రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

# బాపట్లలో ప్రధాన డ్రైనేజీ పనులపై కమిషనర్ పరిశీలన

యుద్ధ ప్రాతిపదికన పూడికతీత పనుల పూర్తి చర్యలు ప్రారంభం....



**బాపట్ల మే 30 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల మున్సిపాలిటీలో పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో భాగంగా 13వ వార్డు రైల్వే ట్రాక్ నుండి మునిసిపల్ కార్యాలయం వరకు ఉన్న త్రవ్వ కాలువను కలిగిన ప్రధాన డ్రైనేజీ పనులను మునిసిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి శు క్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పట్టణంలోని మురుగు నీటి ప్రవాహాన్ని నిరవధికంగా నిర్వహించేందుకు ప్రధాన డ్రైనేజీ పూడిక తీత పనులు అత్యవసరమని పేర్కొన్నారు ఇప్పటికే పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభమయ్యాయని, వీటిని సమయాను సారంగా పూర్తి చేసి పట్టణంలోని అన్ని ప్రధాన కాలువలను అనుసంధానం చేయాలన్నారు ఈ పనులపై సమగ్ర ప్రణాళిక రూపొందించి ఇంజనీరింగ్ విభాగం మరియు ప్రజారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు కాలువల శుభ్రత నిరంతర నీటి ప్రవాహం కలిగించేందుకు అవసరమైన మానవవనరులను సమృద్ధిగా వినియోగించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ ఎస్.ఎస్.ఎస్ కృష్ణా రెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్ సి.హెచ్ కరుణ పురపాలక సంఘ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు ప్రజల సహకారంతో డ్రైనేజీ సమస్యల నుండి శాశ్వత పరిష్కారం దిశగా ముందడుగు వేస్తున్నామని కమిషనర్ హామీ ఇచ్చారు

# తాడిపూడి ఇసుక ర్యాంప్‌ను పరిశీలించిన ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటిరాధాకృష్ణ



**తాళ్లపూడి,మే30, ప్రజాజ్యోతి న్యూస్** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పినట్లుగా ఇసుక వ్యాపారంలో అవినీతి జరగకుండా సిండికేట్ చేతుల్లోకి వెళ్లకుండా ఉచిత ఇసుకపేదలకువినియోగదారులకు తక్కువ ధరలకు చేరేలా ప్రవేశపెట్టినటువంటి ఇసుక పూర్తిస్థాయిలో అమలు జరగాలని కోరుకుంటున్నానని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేనిప్రభాకర్ .అన్నారు శు క్రవారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణతో కలిసి తాడిపూడి ఇసుక ర్యాంప్ ని పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం రాబోతున్న కారణంగా స్టాక్ యార్డ్ కు ఇసుకను తరలిస్తామని అన్నారు. నేటి నుండి ఏలూరు స్టాక్ యార్డ్ కు ఇసుకను రవాణా చేయడానికి ఈ ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని అన్నారు. ఇసుక అక్రమరవాణాజరుగుతున్నట్టు పలు పత్రికల్లో ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని అన్నారు. ఇసుక వ్యాపారంలో అక్రమాలు చోటు చేసుకుంటే తగిన చర్యలు తీసుకోవాలని ఆర్డిఓ కు తెలియజేయడం జరిగిందని అన్నారు. అలాగే మీడియా దృష్టికి వచ్చిన సంబంధిత అధికారులకుతెలియపరచవచ్చని అన్నారు అన్నారు

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం...

## ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస బాబు, మండల తాసిల్దార్ సాయి రాజు



**పోలవరం అన్వేషణ న్యూస్ మే 30 :** పోలవరం మండలం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస బాబు, మండల తహసీల్దార్ సాయి రాజు పాల్గొన్నారు. యోగాసనాల అభ్యసన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల తాసిల్దార్ సాయిరాజు ఎంపీడీవో సిహెచ్. శ్రీనివాస బాబులు మాట్లాడుతూ యోగాసనాలు మనిషి ఆరోగ్యానికి దారిదీపాలని, ప్రతిఒక్కరూ యోగా, ధ్యానాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని, యోగాను నేర్చుకొని జీవితాంతం ఆచరించాలని సూచించారు. మన భారతీయ సంస్కృతి ప్రపంచానికి ఇచ్చిన అమూల్య బహుమతి యోగా అని, ఇది కేవలం శారీరక ఆరోగ్యానికే కాకుండా మానసిక ఆరోగ్యానికి దృఢత్వం చేకూర్చుతుందని పేర్కొన్నారు. యోగాచరణను ఏదో ఒక్కరోజుకే పరిమితం చేయకుండా తమ జీవనశైలిలో భాగం చేసుకోవడం ద్వారా రోజువారీ పనిలో మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వై కొండలరావు, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఘనంగా అభయ ఆంజనేయ దేవాలయం ప్రతిష్ఠా కార్యక్రమాలు





**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్:** పొందూరు మండలం బురిడికంచరాం గ్రామంలో శ్రీ గణపతి సుబ్రహ్మణ్యం సహిత శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి . గురువారం నాడు ప్రారంభమైన ఈ కార్యక్రమాలు మూడు రోజుల పాటు ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఏపి సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసా నంద సరస్వతీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితో పాటు గ్రామ ప్రజలు అందరూ కంకణాలు కట్టు కొని విఘ్నేశ్వర పూజ చేశారు..అనంతరం అగ్ని హెూమం , అంగ హెూమాలు చేశారు. వీటితో పాటు కుంకుమ పూజలు , సూర్య నమస్కారాలు నిర్వహించారు. సుమారు 2000 నుండి 3000 మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అఖండ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

## ప్రధాన ఉపాధ్యాయులుగా ముగ్గురికి పదోన్నతి

ఒకే పాఠశాల నుండి ఎంపికైన ఉపాధ్యాయులు

హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు , పాఠశాల సిబ్బంది



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం తాడి వలస ఉన్నత పాఠశాలలో పనిచే స్తున్న ముగ్గురు స్కూల్ అసిస్టెంట్ లకు ఒకేసారి హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులుగా పదోన్నతి లభించింది. భౌతికశాస్త్రం , గణితం , సాంఘిక శాస్త్రం ఉపా ద్యాయులు గోపాల శెట్టి సాయికు మార్ ,పూజారి హరి ప్రసన్న , లాభాల గున్నేశ్వర రావు లకు గురువారం జరిగిన కౌన్సెలింగ్ లో గజిటెడ్ హెచ్.ఎం.లు గా పదోన్నతి పొందినట్లు తాడి వలస పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బల్ల కంటయ్య తెలిపారు. వీరు సంతబొమ్మాళి మండలం వడ్డివాడ ,టెక్కలి మండలం బూర గాం , నంది గాం మండలం దేవళ భద్ర పాఠశాలలో గ్రేడ్ 2 ప్రధాన ఉపాధ్యాయులుగా భాధ్యతలు చేపట్టనున్నారు. వీరి పదోన్నతి పట్ల గ్రామస్తులు , పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## పవిత్రతకు ప్రతీకగా లూథరన్ చర్చిలో ప్రతిష్ఠా మహెూత్సవం

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రత్యేక ప్రార్థనలు



**బాపట్ల మే 30 (ప్రజాజ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పిట్టలవానిపాలెం మండలంలోని పిట్టలవానిపాలెం గ్రామంలో క్రీస్తు లూథరన్ చర్చిలో జరిగిన ప్రతిష్ఠా మహెూత్సవ కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఆయన ఆధ్యాత్మిక కేంద్రాల ద్వారా సమాజంలో శాంతి సానుభూతి సేవా భావం పెంపొందుతుంది ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురాగలవు అని అన్నారు చర్చిలో నిర్వహించిన ప్రార్థనలతో పాటు సంగీత కార్యక్రమాలు విశ్వాసుల ఆత్మీయ కలయికలు విశేష ఆకర్షణగా నిలిచాయి గ్రామస్తులు విశ్వాసులు స్థానిక నాయకులు కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు


## తహసీల్దార్ కార్యాలయంలో విచారణ

కంప్యూటర్ ఆపరేటర్ వికృత చేష్టలపై విచారణ చేపట్టిన పోలీసులు




**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్:** పొందూరు తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న సువ్వారి సన్యాసిరావు బాత్ రూం లో మహిళా ఉద్యోగి వీడియో చిత్రీకరణ ఘటన పై ఆమదాలవలస సి. ఐ పి సత్యనారాయణ , పొందూరు ఎస్. ఐ వి సత్యన్నారాయణ విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు లో భాగంగా కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను విచారణ చేశారు. తహసీల్దార్ ఆర్ వెంకటేష్ సమక్షంలో జరిపిన విచారణ లో గతంలో సన్యాసి రావు కారణంగా ఎదుర్కొన్న లైగింక వేధింపులను వివరించారు. బాధితురాలి నుండి స్టేట్ మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొన్న వేధింపులను ఒక్కొక్కరిగా పోలీసులకు వివరించారు. ఘటన పై విచారణ నివేదికను ఉన్నత అధికారులకు సమర్పించనున్నట్లు సి. ఐ సత్యన్నారాయణ తెలిపారు.

## ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు (పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం )



**అనంతగిరి మే.30 ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్.శంకర్.** కొండలు పిండి చేసిన ప్రజా రహదారులు కబ్జా చేసిన. ప్రభుత్వ భూములు కబ్జా చేసిన.మాకు సంబంధం లేదు.ఇది అనంతగిరి మండల రెవెన్యూ శాఖ తీరు భూములను కాపాడండి మహాప్రభో అంటూ ఎమ్మెల్యే. ప్రజా రహదారులు కాపాడండి మహాప్రభువు అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్న. అనంతగిరి మండలం రెవెన్యూ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం ఎంతుందో అర్థం అవుతుంది. టోకూరు పంచాయతీ పరిధి లో ఉన్న ధర్మరవలస గ్రామానికి అనంతగిరి ప్రధాన రహదారి నుండి ఉపాధి హామీ నిధులు సుమారు 8.లక్షల రూపాయలు నిధులు ఖర్చుపెట్టి ప్రజారహదారి నిర్మిస్తే రహదారిని కబ్జా చేసి.అదే రహదారీ మీద భూ వ్యాపారి కొత్త రహదారి నిర్మించుకున్నారు. ఈ రహదారి భూ వ్యాపారి ఆధీనంలో ఉంది. అక్కడితో ఆగకుండా.ప్రక్కనున్న ప్రభుత్వ అటవీ భూమిని తవ్వి మట్టిని తరలించి. సొంత అవసరాలకు ఉపయోగించుకున్నారు. ప్రభుత్వ భూములలో మట్టి త్రవ్వకాలు జరుగుతున్న.ఏటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలించకపోతున్న. రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తుంది రెవెన్యూ యంత్రాంగం మౌనం పై సబ్ కలెక్టర్కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని స్థానికులు పి. భీమన్న. చిట్టి.రంజితులు తెలిపారు

## నేడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం.

**పోడూరు, మే 30,ప్రజాజ్యోతిన్యూస్. (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** పోడూరు మండల సర్వ సభ్య సమావేశం ఈనెల 31, శనివారం మధ్యాహ్నం 2గంటలకు జరుగునని ఎంపీడీఓ బిఎస్ఎల్ మంగాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె అన్నారు

## రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం కోసం ఎంతో కృషి



**ప్రజా జ్యోతి తుగ్గలి** గ్రామీణ పట్టణ ప్రాంతాలలోని ప్రజల సంక్షేమమే టిడిపి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కె ఈ శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నునసారాళ్ళ గ్రామానికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షులు రామాంజనేయులు నివాస గృహంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన, న్యాయమైన పాలన అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఎన్నికల హామీలను ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర తెలుగు యువత ప్రతినిధి బత్తిన లోకనాథ్, టిడిపి నాయకులు జొన్నగిరి మిద్దె వెంకటేష్ యాదవ్, శ్రీనివాసులు గౌడు, మారెళ్ళ ఈడిగ వెంకట రాముడు, మాజీ సర్పంచులు రంగారెడ్డి, సాంబ, సాగునీటి సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, టిడిపి నాయకులు మహేష్ గౌడు తదితరులు పాల్గొన్నారు

## తిరుపతిలో వాతావరణ శాఖ వీరుడు పదవీ విరమణకు ఘన వీడ్కోలు



**మే 30, తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** వాతావరణ శాఖలో సేవలందించిన నాతి నరసింహారావు పదవీ విరమణ చేయడంతో, తిరుపతిలో ఆయనకు ఘన సన్మాన సభను కార్యక్రమాన్ని ఆయన కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, బంధుమిత్రులు ఏర్పాటు చేశారు. నాతి నరసింహారావు వాతావరణ కేంద్రంలు కాకినాడ, విశాఖపట్నం, కావలి, తిరుపతి లొ విధులు నిర్వర్తించారు. ఆయనతో కలిసి పనిచేసిన సహోద్యోగులు గత అనుభవాలను, సహకారాన్ని గుర్తుచేసుకున్నారు. పలువురు అతనికి పదవీ విరమణ శు భాకాంక్షలు తెలిపారు. చిన్న స్థాయిలో రెయిన్ గేజ్ల ఏర్పాటుతో ప్రారంభమైన భారత వాతావరణ శాఖ, నేడు ప్రపంచస్థాయిలో వాతావరణ సమాచార రంగానికి నేతృత్వం వహించే స్థాయికి ఎదిగిందని వారు తెలిపారు. రుతుపవనాల వైఫల్యం వల్ల ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో వాతావరణ శాఖ అందిస్తున్న సేవల గురించి వివరించారు. ప్రకృతి ముందరి మార్గాలను ప్రజలకు తెలియజేయడం ఎంతో సంతృప్తికరమని నరసింహారావు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్స్ నివాసితులు, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు. శ్రీనివాసులు రెడ్డి, తులసీరామ్, హేమాంబరం తదితరులు ఆయనకు దుస్సాల్వతో సన్మానం చేసి, పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు. వాతావరణ శాఖ నుంచి డిల్లీకి చెందిన డాక్టర్ విజయకుమార్, మల్లేశ్వరరావు (కావలి), చి. నాగభూషణం (విశాఖపట్నం), మురళి, జయశీలరావు (హైదరాబాద్), మురళి నెల్లూరు, ఇతర ప్రాంతాల ఉద్యోగులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు.

# రేషన్ షాపుల్లో స్టాక్ తనిఖీలు చేసిన తహసిల్దార్ సలీమా

జూన్ 1వ తేదీ నుండి కేవలం రేషన్ షాపుల ద్వారానే సరఫరా...

ప్రజలకు అవగాహన కల్పించిన తహసిల్దార్...




**బాపట్ల మే 30 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల మండల తహసిల్దార్ సలీమా శుక్రవారం బాపట్ల పట్టణ పరిధిలోని రేషన్ షాపులను సందర్శించి పలు స్థానాల్లో స్టాక్ తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా రేషన్ షాపుల్లో నిల్వ ఉండు బియ్యం సరుకుల వివరాలు పరిశీలించి సరఫరా ప్రక్రియపై అభిప్రాయాలు సేకరించారు ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుండి రేషన్ బియ్యం ఇతర నిత్యావసర వస్తువులు ప్రజలకు పూర్తిగా రేషన్ షాపుల ద్వారానే సరఫరా చేయనున్నాం కావున ప్రతి కుటుంబం తమకు కేటాయించిన రేషన్ షాపుల నుంచే సరుకులు తీసుకోవాలని కోరుతున్నాం అని తెలిపారు అలాగే ప్రతి షాపులో సరైన ధరల పట్టికలు పప్పు ధాన్యాలు బియ్యం మొదలగునవి నిల్వల బోర్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ప్రజల వినియోగంలో పారదర్శకత కోసం నెలనెలా స్టాక్ తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు షాపు యజమానులకు ఎక్కువ క్యూలైన్లు లేకుండా ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని తాసిల్దార్ సలీమా షాపు డీలర్లకు సూచించారు ఈ తనిఖీల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్ఫేర్ అసిస్టెంట్లు వాలంటీర్లు పాల్గొన్నారు

# జూన్ 1వ తేదీ నుండి చౌక దుకాణాల ద్వారానే సరుకుల పంపిణీ

అమరావతిలో పౌర సరఫరాల శాఖ వీక్షణ సమావేశం

వృద్ధులకు దివ్యాంగులకు ఇంటి వద్దకు సరుకులు...

అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలు...






**బాపట్ల మే 30 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** రేషన్ కార్డుల ఆధారంగా వచ్చే జూన్ 1వ తేదీ నుండి నిత్యావసర సరుకులను కేవలం చౌక ధరల దుకాణాల ద్వారానే పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్ సౌరబ్ గౌర్ తెలిపారు. శుక్రవారం అమరావతిలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షణ సమావేశం నిర్వహించగా, బాపట్ల జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కలెక్టర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి మాట్లాడుతూ, వృద్ధులు, దివ్యాంగులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే సరుకులు అందించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4.70 లక్షల మంది లబ్ధిదారులలో 67,800 మంది వృద్ధులు, దివ్యాంగులుగా గుర్తించబడినట్లు వెల్లడించారు.జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇంటింటికీ సరుకులు పంపిణీ చేయాలని, ఇ-పాస్, వేయింగ్ మిషన్లను తూనికలు కొలతల శాఖ అధికారులు సరిచూడాలని సూచించారు. చౌక దుకాణాల లైసెన్స్ సంబంధిత పరిశీలన ఈ నెల 31వ తేదీలోగా పూర్తిచేయాలని, సరుకుల పంపిణీపై విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కూడా ఈ సందర్భంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు

# కాల్పుల విరమణ సంఘటనలు మన దేశ సార్వ భౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్





**గుంతకల్లు మే 30 (ప్రజా జ్యోతి):** పాకిస్తాన్తో భారత్ కాల్పుల విరమణ సంఘటన లు మన దేశ సార్వ భౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ పేర్కొన్నారు. పెహల్గాం ఉగ్రవాదుల దాడి ,తదనంతరం పరిణామాలు పై శుక్రవారం పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ సదస్సుకు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.రాంభూపా ల్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడికి దేశవ్యాప్తంగా సమైక్య తా భావం వెల్లివిరిసింది. అయితే అమెరికా ఆదేశాలతో జరిగిన కాల్పుల విరమణ తదనంత రం జరిగిన సంఘట నలు ఇన్నేళ్లుగా మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయి,యుద్ధోన్మాదం తో రెచ్చిపోయిన మూకలు అధికారుల మీద వారి కుటుంబ సభ్యుల మీద చేస్తున్న ట్రోలింగ్ దాడులు సమైక్య తకు సవాళ్లు విసిరుతున్నాయి.ఇంత జరుగుతున్న ప్రధాని మౌనమునిగా మారిపోవడం మరింత ఆందోళనకరంగా ఉంది అన్నారు. అదేవిధంగా కేంద్రానికి మద్దతు ఇస్తున్న తెలుగుదేశం,జనసేన పార్టీలు ఖండిం చకపోగా బిజెపి తిరంగా యాత్రను ప్రభుత్వ యాత్రగా మార్చి లౌకిక శక్తులను దూరం చేసుకుంటు న్నాయి.ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు చేస్తున్న ఈ దుర్మార్గపు చర్యలను వైసిపి వ్యతిరేకించడం లేదు బిజెపికి ఉపయోగపడే చర్యలు అంతిమంగా ఈ మూడు పార్టీలకు చేటు చేస్తాయని గుర్తించాలి అన్నారు.యుద్ధున్మాదానికి మతోన్మాదానికి వ్యతి రేకంగా లౌకిక ప్రజాస్వామిక శక్తులను రాష్ట్ర వారసత్వపు విలువలను సమూన్నతంగా నిలపాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఐ(ఎమ్.ఎల్) న్యూడెమోక్రసి పార్టీ జిల్లా నాయకులు బి.సూరేష్,సిపిఐ పార్టీ నాయకులు సురేష్, ఆర్.కే.నాయుడు,,శ్రీనివాసుల, వై.శ్రీ నివాసులు, ఆదినారాయ ణ,సిపిఎం జిల్లా పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు సాకె నాగరాజు,జగ్గిలి రమేష్, కసాపురం రమేష్, పట్టణ నాయకులు డి.శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఉలిగప్ప, ఓబులేసు, షాష,అబ్దుల్లా, ఎస్కేయం భాషా, రామునాయక్, జ్యోతి, జయమ్మ,సూరి,షాకీర,ఖాదర్ మరియ ప్రజలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంట కాలంలో రైతులు మేలైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

కృషి విజ్ఞాన కేంద్రం యొక్క సేవలను రైతులు వినియోగించుకోవాలి

అందుబాటులో ఉన్నటువంటి వరి విత్తనాలు, వరాలు నూతన రకాలు రైతులు వినియోగించుకోవాలి.



**ప్రజా జ్యోతి ( బూర్జ)** స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాఖ సమన్వయంతో బూర్జమండలం ఉప్పెన వలస గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ పంట కాలంలో రైతులు పాటించాల్సిన అంశాలైన విత్తన రకాల ఎంపిక వాటి లభ్యత వ్యవసాయ అనుబంధ రంగాలలో రైతులు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ కె శ్రీ కృష్ణం నాయుడు గ్రామంలో రైతులు యొక్క వ్యవసాయ మరియు ఉద్యాన పంటలలో సమస్యలు, మరియు సందేహాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రీయ పరిశోధన మరియు కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు రైతులు యొక్క సమస్యలు పై ముఖాముఖి చర్చించారు. కేంద్రీయ పరిశోధనా స్థానం నుంచి వచ్చిన శ్రీ శైలజ వ్యవసాయంలో యువత ముందుకు రావాలని కోరారు, ఉద్యాన పంటల్లో వచ్చేటటువంటి చీడపీడల గురించి మరియు ఉద్యాన శాఖ ద్వారా వివిధ పథకాల గురించి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ పి అశోక్, పెద్దపేట, మరియు ఉద్యాన అధికారి శ్రీ అయంతి రైతులకు వివరించారు. అనంతరం గోగు పరిశోధనా స్థానం నుంచి డాక్టర్ శ్రీనివాస కట్టే జనుము పంటల గురించి రైతులు ముందుకు రావాలని కోరారు. బూర్జ మండల ప్రజలు కృషి విజ్ఞాన కేంద్రం యొక్క సేవలు వినియోగించుకోవాలని, వరి పండించే రైతులు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు గురించి, కృషి విజ్ఞాన కేంద్రం యందు అందుబాటులో ఉన్నటువంటి వరి విత్తనాలు, వరాలు విత్తనాలు నూతన రకాలను రైతులు వినియోగించు కోవాలని మరియు మహిళలు యువత కె.వికె అందించే శిక్షణ కార్యక్రమాల ద్వారా వ్యాపారవేత్తలుగా మారాలని డాక్టర్ ఎస్ అనూష సస్యరక్షణ శాస్త్రవేత్త తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గన్నె రాజు ,తెలుగు దేశ పార్టీ నాయకులు ఇచ్చే వాసుదేవ్ . డి వెంకటరమణ . మరియు స్థానిక రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి దిలీపు మత్స్య శాఖ నుంచి అధికారులు పాల్గొన్నారు. అనంతరం దగ్గరలో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ రైతు క్షేత్రాన్ని సందర్శించారు.

## బాపట్లను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి - కలెక్టర్ దిశానిర్దేశం

బాల కార్మిక నిర్మూలనకు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలి కలెక్టర్ వెంకటమురళి



**బాపట్ల మే 30 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాను బాల కార్మిక రహితంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు సమన్వయంతో చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ జె. వెంకట మురళి సూచించారు శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ మాసాన్ని చైల్డ్ లేబర్ డ్రైవ్ మాసంగా నిర్వహించనున్నట్లు తెలిపారు 14 సంవత్సరాల లోపు పిల్లలు పని చేయకుండా ఉండేందుకు 2009 విద్యాహక్కు చట్టం 2016 చైల్డ్ లేబర్ నిషేధ చట్టాల అమలుపై స్పష్టంగా వివరించారు జిల్లాలో గ్రానైట్ క్వారీలు ఇసుక రీచ్‌లు ఫ్యాక్టరీలు హోటళ్ల వంటి ప్రదేశాల్లో తనిఖీలు జరిపి బాల కార్మికులను గుర్తించాలన్నారు వారిని రియాబిలిటేషన్ సెంటర్లకు తరలించి పాఠశాలల్లో చేర్చాలని బాధ్యులపై కేసులు నమోదు చేయాలని సూచించారు ప్రజలతో కూడిన అవగాహన కార్యక్రమాలు ర్యాలీలు కరపత్రాల ద్వారా చట్టాలపై ప్రచారం చేయాలని బాల కార్మికుల సమాచారం కోసం 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని ప్రజలను కోరారు సమాచారం గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు ఈ సమావేశంలో లేబర్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట శివప్రసాద్ పిల్లల సంరక్షణాధికారి పురుషోత్తం వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి తదితరులు పాల్గొన్నారు

## బేతపూడిలో గ్రామసభ - స్వచ్ఛతపై అవగాహన




**బాపట్ల మే 30 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం కింద బాపట్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం బేతపూడి గ్రామంలో గ్రామసభ నిర్వహించబడింది ఈ సభలో గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలతో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. బాబురావు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు తడి చెత్త పొడి చెత్తను వేరుగా ఇచ్చే అలవాటు పాటించాలని వీధుల ఇరువైపులా చెత్త వేయకుండా స్వచ్ఛతకు తోడ్పడాలని గ్రామస్థులకు సూచించారు స్వచ్ఛ గ్రామాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు ప్రజలను కోరారు.

## స్లీపర్ సెల్‌లో యూ ట్యూబర్ బయ్యా యాదవ్

**హైదరాబాద్ :** యూట్యూబ్ సెలబ్రిటీ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న వారిలో ఒకరు బయ్యా సన్నీ యాదవ్. ప్రపంచం మొత్తం బైక్ మీద తిరుగుతూ, అందుకు సంబంధించిన వీడియోస్ ని యూట్యూబ్ లో అప్లోడ్ చేయడం, అవి బాగా వైరల్ అవ్వడం వంటివి జరుగుతూ ఉండేవి. అయితే బెట్టింగ్ యాప్స్ ని ఒక రేంజ్ లో ప్రమోట్ చేయడం వల్ల ఇతనిపై కేసులు నమోదు చేసి గత కొంతకాలంగా పోలీసులు ఇతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఎట్టకేలకు రీసెంట్ గా అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకొని ఇతన్ని విచారిం చగా కొన్ని సంచలన విషయాలు బయటపడ్డాయి. 'ఆపరేషన్ సింధూర్' సమయంలో ఇతను పాకిస్తాన్ లో ఉండేవాడట. దుబాయ్ లో ఉన్నప్పుడు ఈయనకు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన దుబాయి నుండి నేరుగా పాకిస్తాన్ కి వచ్చాడు. ఇప్పటి వరకు ఈయన 5 సార్లు పాకిస్తాన్ కి వెళ్లినట్టు సమాచారం.అసలు ఇరు దేశాల మధ్య రాకపోకలు ఆగిపోయిన సమయంలో ఇతను పాకిస్తాన్ కి ఎలా చేరాడు?, దేశం కష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఇతను శత్రు దేశం లో ఎందుకు తలదాచుకున్నాడు? అనే అంశాలపై ప్రస్తుతం పోలీసులు ఆరా తీస్తున్నారు. రీసెంట్ గానే పాకిస్తాన్ గూఢచారి జ్యోతి మల్హోత్రా ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమె తో సన్నీ కి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోసం లో కూడా విచారిస్తున్నారు పోలీసులు. ఇతని గురించి తెలిసిన ఈ కొత్త నిజాలను చూసి నెటిజెన్స్ నోరెళ్లబెడుతున్నారు. ఎదో బెట్టింగ్ స్కాం లో ఒక్కటే ఇరుకున్నాడని అనుకుంటే, ఇరు దేశాల మధ్య యుద్ధం జరుగుతున్న సమయం లో శత్రు దేశం లో తలదాచుకోవడం లో ఆంతర్యం ఏమిటి?, ఇతనికి కూడా పాకిస్తాన్ టెర్రరిస్ట్స్ తో సంబంధాలు ఉన్నాయా?, మన దేశం లో పాకిస్తాన్ స్లీపర్ సెల్స్ చాలా మంది ఉన్నారు.రీసెంట్ గానే వైజాగ్ లో కూడా ఒక స్లీపర్ సెల్ ని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసిన సంగతి మన అందరికీ తెలిసిందే. బన్నీ సన్నీ యాదవ్ కూడా ఆ కోవకు చెందిన వ్యక్తియేనా? అని అతన్ని అనుసరించే వాళ్ళు కూడా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ ప్రశ్నిస్తున్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు పోలీసులే తెలియచేయాల్సి ఉంటుంది. సన్నీ యాదవ్ ఒక విధంగా అరెస్ట్ అవ్వడానికి కారణం అన్వేష్ అనొచ్చు (నా అన్వేషణ, ప్రపంచ యాత్రికుడు). బెట్టింగ్ యాప్స్ పై ఆయన పెద్ద యుద్ధమే చేస్తున్నాడు. గతంలో ఈ అంశంపై వీళ్లిద్దరి మధ్య గొడవలు వేరే లెవెల్ లో జరిగాయి. అసభ్యకరమైన పాదయాజాలంతో దూషించుకున్నారు. అన్వేష్ వల్ల సన్నీ యాదవ్ బెట్టింగ్ యాప్స్ ని ప్రమోట్ చేయడం లో కింగ్ అని తెలిసి అతని పై కేసు ని నమోదు చేసాడు, ఎట్టకేలకు ఇప్పుడు అదుపులోకి తీసుకున్నారు.

## ఆయుష్మాన్ స్కీంలో ఇంపార్ట్ టెంట్ అప్ డేట్

**హైదరాబాద్ :** ఆదాయంతో సంబంధం లేకుండా అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో సీనియర్ సిటిజన్స్ చికిత్స పొందవచ్చు. అయితే 70 ఏళ్ళు పైబడిన ఈ కార్డు కోసం ఆయుష్మాన్ భారత్ యాప్ ద్వారా 10 సులభమైన దశలలో ఎలా దరఖాస్తు చేసుకోవాలో అలాగే ఈ కేవైసీ ప్రక్రియ ఎలా పూర్తి చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. 70 ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్స్ కి కేంద్ర ప్రభుత్వం ఒక శుభవార్త తెలిపింది. పై వారికి ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా కూడా ఆసుపత్రి ఖర్చుల గురించి భయపడాల్సిన అవసరం ఉండదు. సీనియర్ సిటిజన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ వయా వందన యోజన పథకం ద్వారా సీనియర్ సిటిజన్స్ ఉచితంగా ఐదు లక్షల వరకు బీమా పొందవచ్చు. మీరు సంపాదించిన దానితో సంబంధం లేకుండా అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో ఈ కార్డుతో సీనియర్ సిటిజన్స్ ఉచితంగా చికిత్స చేయించుకోవచ్చు.దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అక్టోబర్ 2024లో ప్రారంభించిన ఈ పథకం ఆయుష్మాన్ భారత్ లో ఒక భాగం

# తెలంగాణ కాంగ్రెస్‌ను లైట్ తీసుకుంటున్న అధిష్ఠానం



**హైదరాబాద్ :** దేశంలో బిజెపి జోరును తట్టుకుని మూడే మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అందులోనూ తెలంగాణలో మరే ఇతర పార్టీలతో పొత్తు లేకుండా రేవంత్ ప్రభుత్వం ఏర్పడింది. కూటమి కుంపట్లకు దూరంగా తెలంగాణలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ పరిస్దితి ఇప్పుడు ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేవంత్ పగ్గాలు చేపట్టిన తరువాత ఆరు గ్యారంటీలలో ఉచిత బస్సు,గ్యాస్ సబ్సిడీ, రైతు రుణమాఫీ ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. కానీ ఆ పథకాల నుంచి ఆశించిన స్దాయిలో అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికిక మైలేజ్ పొందలేక పోయారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం క్షేత్రస్థాయిలో పార్టీకి బ్రాండ్ అంబాసిడర్లుగా చెప్పుకునే పిసిసి కార్యవర్గమే ఇంకా ఏర్పాటు కాలేదు. పిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు తీసుకుని తొమ్మిది నెలలు దాటినా, నేటికీ క్షేత్రస్థాయిలో కమిటీల నియామకం జరగలేదు. అలా అని తప్పు రాష్ట్ర పార్టీదా అంటే కాదు, ఇక్కడ లైట్లు వెలగాలంటే అక్కడ స్విచ్ నొక్కాలి. అలా ఢిల్లీలో స్విచ్ ఆన్ చేయించేందుకు హైదరాబాద్ నుంచి సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి ఛీఫ్ అనేక సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోవాల్సిన పరిస్థితులొచ్చాయి. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ కాంగ్రెస్ ను ఢిల్లీ పెద్దలు లైట్ తీసుకున్నారనే స్థాయిలో పరిస్థితులు చేరాయి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పిసిసి కార్యవర్గంలో తమకూ చోటు దక్కుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నవారి లిస్ట్ చాంతాడంత ఉంది. అయితే అందులో ఇప్పటికే వడపోతల తరువాత ఒక్కో పదవికి మూడు పేర్లు చప్పున లిస్ట్ సిద్దం చేసింది పిసిసి. మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రేపో మాపో పదవులు ప్రకటన రాబోతుందని కోటి ఆశలు పెట్టుకున్నవారు ఇప్పుడు నీరసించి విసిగిపోయారు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నా కనీసం ప్రచార కమిటీ నియామకం కూడా జరగలేదు. ఆర్టీసీ, సివిల్ సప్లయ్ కార్పొరేషన్లు వంటి రాష్ట్ర స్దాయి పదవుల నుంచి మార్కెటింగ్ కమిటీ చైర్మెన్లు, లైబ్రరీ చైర్మన్లు ఇలా నామిటేటెడ్ పోస్టుల ఊసేలేదు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సర్పంచి టూ జెడ్ పీ చైర్మన్ వరకూ ఏ ఒక్కరి పేర్లు ఖరారు చేయలేదు. సిఎం రేవంత్ రెడ్డితోపాటు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సైతం అనేకసార్లు ఢిల్లీ పెద్దలను కలిసేందుకు వెళ్లారు. పిసిసి కార్యవర్గం లిస్ట్‌కు ఆమోదం కోసం అందుబాటులో ఉన్న పెద్దలను కలిసినా ఫలితం లేదు. ఇంకా స్విచ్ నొక్కాలంటే సమయం పడుతుందని ఢిల్లీ నుంచి వెనక్కి పంపేశారు. రేవంత్ రెడ్డి సిఎం పదవి చేపట్టి ఏడాదిన్నర దాటినా, మంత్రివర్గ విస్తరణ మాత్రం అతి పెద్ద టాస్క్‌గా మారింది. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చినప్పుడు పడ్డ కష్టాలకంటే మంత్రివర్గ విస్తరణ కోసం పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న అవమానాలే ఎక్కువైయ్యాయనే టాక్ నడుస్తోంది. తెలంగాణ క్యాబినెట్‌లో మొత్తం 18 మంత్రి పదవులకుగానీ సిఎంతో కలపి మొత్తం 12 మంత్రి పదవులు భర్తీ అయ్యాయి. మరో ఆరు శాఖలు ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ఆశావాహుల లిస్ట్ తో ఢిల్లీ చుట్టూ సిఎం రేవంత్ రెడ్డి ఎక్కే ఫ్లైట్, దిగే ఫ్లైట్ అంటూ ఎంత తిరిగినా అధిష్ఠానం పెద్దల నుంచి రేవంత్ లిస్ట్‌కు ఆమోదం దొరకలేదు. తాజాగా ఖర్గే అందుబాటులో లేరని వెనక్కు పంపించేశారు. గతంలో వెళ్లినా రాహుల్ ఉంటే కేసీ వేణుగోపాల్ ఉండరు, వాళ్లిద్దరూ ఉంటే మరొకరు ఉండరు. ఇప్పటికే ప్రతిపక్షాలు రేవంత్ ఢిల్లీ పర్యటనపై సెటైర్లు వేస్తూ ఓ రేంజ్ లో మాటల తూటాలు పేలుస్తు?న్నారు. వారి మాటలకు మరింత బలం చేకూరేలా ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలూ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు చూస్తుంటే, తెలంగాణ కాంగ్రెస్ ను ఢిల్లీ పెద్దలు లైట్ తీసుకున్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉంటే పదేళ్ల పాటు పార్టీ కోసం శ్రమించి, తీరా అధికారంలోకి వచ్చినా ఆశించిన పదవులు అందకపోవడంతో కింది స్థాయి క్యాడర్ లో నిస్తేజం నెలకొటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# కుటుంబ కథా చిత్రమ్...





**హైదరాబాద్ :** నిజమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రావాల్సిన కష్టం కాదు ఇది. ఒకవైపు కుమారుడు. మరొకరు కుమార్తె. ఇద్దరూ రక్తం పంచుకుపుట్టిన వారే. పేగు తెంచుకున్న వారే పీకలు కోసేందుకు సిద్ధమవ్వడం అదీ తన కళ్ల ముందే జరుగుతుండటం ఏ తండ్రికీ రాకూడని కష్టం. ఆస్తిపాస్తులంటే...అటో ఇటో పంచి ఇవ్వవచ్చు. కానీ పార్టీని పంచి పెట్టడమంటే ఆచరణలో సాధ్యం కాదు. ఇందులో తూనికలు.. కొలతలు... బరువులకు తావుండదు. ఒకే లెక్క. ప్రాంతీయ పార్టీలో ఒకరి నాయకత్వమే ఉంటుంది. అందులో ఎలాంటి సందేహం లేదు. నెంబర్ వన్, నెంబర్ 2 అనేది ఉంటే అది పార్టీ పతనానికి దారి తీస్తుంది. అందుకే నెంబర్ 2 ప్రాంతీయ పార్టీల్లో ఉండనే ఉండవు. అందుకే ఇప్పుడు కేసీఆర్ కు పెద్ద కష్టమే వచ్చిపడింది. ఏ తండ్రికీ రాని రాజకీయ నష్టం సొంత కుటుంబ సభ్యుల నుంచి వచ్చింది. బయట వ్యక్తులనయితే కేసీఆర్ అస్సలు లెక్క చేయరు. వెనువెంటనే పార్టీ నుంచి బయటకు పంపేవారు. కానీ ఇప్పుడు తన కుమార్తె కల్వకుంట్ల కవితను బయటకు పంపలేని పరిస్థితి. అలాగని కేటీఆర్ కు కాదని కవిత కు ప్రాధాన్యత ఇవ్వలేని స్థితి. గత కొంతకాలంగా కేటీఆర్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. క్యాడర్ నుంచి నేతలు కేటీఆర్ కు దగ్గరయ్యారు. తన రాజకీయ వారసత్వం కేటీఆర్ కు ఇవ్వాలని భావించి అధికారంలో ఉన్నప్పుడే కేసీఆర్ కేటీఆర్ ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా చేశారు. అప్పుడే అందరికీ వారసత్వం విషయంలో కేసీఆర్ క్లారిటీ ఇచ్చారు. బహుశ కవితకు కూడా అప్పుడే అర్థమయి ఉండాలి. కానీ ఇన్నేళ్లు ఆగి ఇప్పుడు రివర్స్ అయ్యారంటే కేవలం రాజకీయమొక్కటే కాదనే వారు కూడా ఉన్నారు.అడ్డంగా దొరికారు ముందే తెలిసినా కేసీఆర్. బీజేపీతో బీఆర్ఎస్ ను విలీనం చేయాలన్న ప్రతిపాదనను తాను వ్యతిరేకించినందునే తనపై పెయిడ్ ఆర్టిస్టుల చేత కొందరు అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారంటూ కవిత ఫైర్ అయ్యారు. ఇంతకీ కవిత ఏం ఆశిస్తున్నారు. కేసీఆర్ బీఆర్ఎస్ అధినేత. ఆయనతో నేరుగా కలసి చెప్పుకునే అవకాశం ఉంది. ఒకవేళ చెప్పినా కేసీఆర్ కవిత ప్రతిపాదనలకు అంగీకరించకపోయి ఉండాలి. అందుకే కవిత బహిరంగంగానే తన సోదరుడు కేటీఆర్ పై నేరుగా బాణాలు గురిపెట్టారని అనుకోవాలి. కేసీఆర్ కు కూడా ఇది ముందే తెలిసి ఉంటుంది. కవిత తాను స్పష్టంగా లేఖల ద్వారా తెలియజేసినప్పుడే కేసీఆర్ కు అర్థమయి దానిని మొదట్లోనే తుంచి వేసే ప్రయత్నం చేయాల్సింది. కానీ కల్వకుంట్ల కవిత నుంచి ఇలాంటి రియాక్షన్ రాదని గులాబీ బాస్ ఊహించి ఉండవచ్చు. . అయితే బీఆర్ఎస్ లో అన్నా చెల్లెళ్ల వివాదం కారు పార్టీ క్యాడర్ లో అయోమయం నెలకొంటుంది. సహజంగా కేటీఆర్ వైపు కేసీఆర్ మొగ్గు చూపే అవకాశాలున్నాయి. కేటీఆర్ ను కాదని కవిత వైపు కేసీఆర్ చూడకపోవచ్చని కూడా అంటున్నారు. మేనల్లుడు హరీశ్ రావు నుంచి ఈ ప్రమాదం ఎప్పుడైనా వస్తుందని భావించిన కేసీఆర్ కు కుమార్తె నుంచి రావడం మింగుడుపడని విషయమే. ఇద్దరినీ కలసి కూర్చోబెట్టి కేసీఆర్ రాజీ ప్రయత్నం చేసినా అది అతుక్కోలేనంత దూరం వెళ్లిపోయినట్లే కనిపిస్తుంది. అందుకే ఇప్పుడు కేసీఆర్ కు వచ్చిన కష్టం మామూలుది కాదు. వదిలేసేది కాదు. కవితను ఇలానే వదిలేస్తే ఆమె చేసే వ్యాఖ్యలు పార్టీని మరింత డ్యామేజ్ చేస్తాయి. అందుకే కేసీఆర్ ఏం చేయనున్నారన్నది ఇప్పుడు గులాబీ పార్టీలో జరుగుతున్న చర్చ. మరి ఏం జరుగుతుందన్నది చూడాలంటే కొంత సమయం వెయిట్ చేయక తప్పదు.

# వివాదంలో సినిమా అవార్డులు

**హైదరాబాద్ :** తెలంగాణలో రాజకీయ వేడి రాజుకుంది. గద్దర్ పేరుతో అవార్డులు ప్రకటిస్తూ.. 'పుష్ప 2' హీరో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా పురస్కారం ఇవ్వడంపై బీజేపీ కాంగ్రెస్‌ను ఎండగడుతోంది. ఒకవైపు పోలీసులకు వ్యతిరేకంగా ఉన్న సినిమాను విమర్శిస్తూనే.. మరోవైపు అదే వ్యక్తికి అవార్డు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తోంది. ఇది కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ వివాదం ఎటు దారి తీస్తుందో చూడాలి. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.తెలంగాణలో రాజకీయ విమర్శలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా.. తెలంగాణ బీజేపీ తన సోషల్ మీడియా ఎక్స్ ఖాతాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రజా గాయకుడు గద్దర్ పేరుతో అవార్డులను ప్రకటించింది. ఈ పురస్కారాల్లో భాగంగా, 'పుష్ప 2' సినిమా హీరోగా చేసిన అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడి అవార్డు వరించింది. అయితే.. ఈ నిర్ణయంపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో, ముఖ్యంగా బీజేపీ నుండి పరోక్ష విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నిజానికి, 'పుష్ప' సినిమాలో పోలీసులు, ప్రభుత్వ వ్యవస్థలకు వ్యతిరేకంగా హీరో వ్యవహరించడంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గతంలో తీవ్ర విమర్శలు చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పాత్రలను ప్రోత్సహించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల జరిగిన సంధ్యా థియేటర్ ఘటనలో కూడా అల్లు అర్జున్ తీరుపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు గుప్పించారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా సాహసం చేసిన పాత్రకు అవార్డు ఇవ్వడం, అంతేకాకుండా పోలీసుల ఊచకోతకు కారణమైన నక్సల్ నేపథ్యం ఉన్న గద్దర్ పేరుతో అవార్డులు ప్రకటించడంపై బీజేపీ పరోక్షంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.బీజేపీ తెలంగాణ తన సోషల్ మీడియా ఖాతాలో "రంగు రంగుల జండాలు మార్చిన రంగోలి రేవంత్ నాయకత్వంలో... అసలు రంగు కాంగ్రెస్ నాయకులు మర్చిపోయినట్టున్నారు" అంటూ వ్యంగ్యంగా పోస్ట్ చేసింది. దీని ద్వారా.. ఒకవైపు పోలీసులకు వ్యతిరేకంగా ప్రచారం చేసే సినిమాలను, వ్యక్తులను విమర్శిస్తూనే, మరోవైపు అటువంటి వారికి అవార్డులు ఇవ్వడం, గతంలో నక్సల్ ఉద్యమ నేపథ్యం ఉన్న వారికి పురస్కారాలు ప్రకటించడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తుందని బీజేపీ పరోక్షంగా ఆరోపిస్తోంది.

# ఈ లక్షణాలు కనిపిస్తే లైట్ తీసుకోకండి..



ఎవరైనా సరే ప్రతి విషయం గురించి ఎక్కువగా ఆలోచించడం ప్రారంభిస్తే అది ఆరోగ్యంపై, మనసుపై, సంబంధాలపై చెడు ప్రభావం చూపుతుంది. మీరు ఏదైనా విషయంపై మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నారని అనిపిస్తే.. అది అతిగా ఆలోచిస్తున్నట్టు సంకేతం. ఇది సమయానికి గుర్తిస్తే ఈ పరిస్థితిని స్వయంగా నియంత్రించవచ్చు. ఏదైనా చిన్న విషయం జరిగినా అది పూర్తయిన తర్వాత కూడా మళ్లీ మళ్లీ ఆలోచిస్తుంటే.. అది మానసిక సమస్యకు సంకేతం. ఉదాహరణకి ఎవరైనా మీతో ఏదైనా మాట చెప్పారు. ఆ విషయం అక్కడే ముగిసినా.. మీరు దాని గురించి ఎక్కువసేపు ఆలోచిస్తుంటే.. మీరు అతిగా ఆలోచిస్తున్నారని అర్థం. ఈ ఆలోచనల వల్ల తల దించుకుని కూర్చోవడం.. పని మీద దృష్టి లేకపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు గతం గుర్తుకు వచ్చి ఏడవడం సహజమే. కానీ ఒకే విషయాన్ని మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుని ఏడుస్తూ ఉంటే.. అది మనసుపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది. అలాంటి వేళ మనం ఆలోచనలు కంట్రోల్ చేయలేకపోవడం వల్ల బాధ ఎక్కువవుతుంది. ఇది కూడా అతిగా ఆలోచించే లక్షణాల్లో ఒకటి. కొన్ని నిర్ణయాలు తీసుకోవడంలో ఎక్కువసేపు తీసుకోవడం.. చివరికి ఏదీ నిర్ణయించలేక పోవడం కూడా ఒక సంకేతం. ఏదైనా పని చేయాలంటే ముందుగా భయపడటం, మన అభిప్రాయాన్ని చెప్పకుండా మౌనంగా ఉండిపోవడం కూడా అతిగా ఆలోచించే లక్షణాలు. ఇలా ఉంటే పనులు ఆలస్యమవుతాయి.. అవకాశాలు చేజారిపోతాయి. రాత్రిళ్లు మనసు ప్రశాంతంగా లేకపోతే నిద్ర బాగా రాదు. నిద్రలోంచి మధ్యలో మేల్కొనడం, మళ్లీ నిద్ర పట్టకపోవడం జరిగితే ఇది మానసిక ఒత్తిడికి కారణమవుతుంది. దీర్ఘకాలంగా ఇలా జరుగుతుంటే అనేక రకాల ఆరోగ్య సమస్యలు రావచ్చు.బయటకు మాట్లాడకపోవడం కూడా అతిగా ఆలోచించటానికి ప్రధాన కారణం. మీరు మీలోనే అన్ని ఆలోచనలు దాచుకుంటే అవి పెద్ద భారంగా మారుతాయి. అందుకే నమ్మకంగా ఉన్న వ్యక్తితో మీ ఆలోచనలను చెప్పడం మంచిది. ఇలా మాట్లాడటం వల్ల మనసుకు హాయిగా అనిపిస్తుంది. మీకు ఇష్టమైన పాట విని ప్రశాంతంగా ఉండొచ్చు. దీని వల్ల కూడా మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఈ లక్షణాలు కనిపించినప్పుడు వాటిని అలానే వదిలేయకండి. సమస్య పెరగకుండా ముందే గుర్తించాలి. రోజూ చిన్న చిన్న విషయాలపై ఎక్కువగా ఆలోచించకుండా ఉండడానికి ప్రయత్నించండి. దీని వల్ల మీరు ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవించగలరు.

# మూత్రం నుంచి దుర్వాసన వస్తుందా?

కొన్నిసార్లు మూత్రం నుండి దుర్వాసన రావడం సాధారణ విషయం కావచ్చు.. కానీ అది అలానే కొనసాగినా.. లేదా దానితో పాటు ఇతర లక్షణాలు కనిపించినప్పుడు, దానిని తేలికగా తీసుకోకండి. ఇది మీ శరీరంలో ఏదో సమస్య జరుగుతోందనడానికి సంకేతం కావచ్చు. అందువల్ల, సకాలంలో వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. మూత్రం నుండి దుర్వాసన రావడం ఒక సాధారణ సమస్య.. కానీ అకస్మాత్తుగా బలమైన వాసన రావడం ప్రారంభిస్తే దానిని విస్మరించకూడదు. సాధారణంగా మనం దీనిని తక్కువ నీరు త్రాగడం లేదా తక్కువ తినడంతో అనుబంధిస్తాము.. కానీ కొన్నిసార్లు ఇది ఏదో ఒక వ్యాధికి సంకేతం కూడా కావచ్చు. మూత్రం ఎందుకు దుర్వాసన వస్తుంది.. ఏ వ్యాధులు దానికి కారణమవుతాయి.. దానికి చికిత్స ఏమిటి..? శరీరంలో నీరు లేకపోవడం మూత్రం వాసన రావడం అత్యంత సాధారణ కారణం. మీరు తగినంత నీరు త్రాగనప్పుడు, మూత్రం కేంద్రీకృతమై, దానిలోని అమ్మోనియా లాంటి వాసన మరింత బలంగా మారుతుంది. ఉదయం మూత్రంలో కొంచెం వాసన వస్తే అది సాధారణమే, కానీ రోజంతా నీరు త్రాగిన తర్వాత కూడా వాసన కొనసాగితే.. అది ఆందోళన కలిగించే విషయం కావచ్చు. ఖు×లు మహిళల్లో ఒక సాధారణ సమస్య.. కానీ ఇది పురుషులలో కూడా సంభవించవచ్చు. ఈ ఇన్ఫెక్షన్‌లో, మూత్రం నుండి వచ్చే వాసనతో పాటు, మంట, తరచుగా మూత్రవిసర్జన.. పొత్తి కడుపులో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది బ్యాక్టీరియా వల్ల వస్తుంది.. సకాలంలో చికిత్స చేయకపోతే, ఇది మూత్రపిండాలను కూడా దెబ్బతీస్తుంది. ఎవరికైనా డయాబెటిస్ ఉండి, వారి చక్కెర స్థాయి చాలా ఎక్కువగా లేదా తక్కువగా ఉంటే, మూత్రం తీపి వాసన లేదా వింత వాసన రావచ్చు. కొన్ని సందర్భాల్లో ఇది కీటోయాసిడోసిస్‌ను సూచిస్తుంది.. ఇది తీవ్రమైన పరిస్థితి కావచ్చు. మీ మూత్రం కుళ్ళిన వాసన వస్తుంటే, అది కాలేయం లేదా మూత్రపిండాల సమస్యకు సంకేతం కావచ్చు. ముఖ్యంగా మూత్రం ముదురు రంగులో, నురుగుగా లేదా రక్తంతో పాటు దుర్వాసన ఉంటే, మీరు ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. కొన్నిసార్లు కొన్ని ఆహారాలు తినడం వల్ల మూత్రం వాసన కూడా మారుతుంది. ఉదాహరణకు, వెల్లుల్లి, ఉల్లిపాయలు, చేపలు లేదా ఆస్పరాగస్ వంటి కూరగాయలు పెద్ద మొత్తంలో తినడం వల్ల మూత్రం వింత వాసన వస్తుంది. కెఫిన్ - ఆల్కహాల్ తీసుకోవడం కూడా దీనికి దోహదం చేస్తుంది. కొన్ని యాంటీబయాటిక్స్, విటమిన్ సప్లిమెంట్లు (ముఖ్యంగా బి-కాంప్లెక్స్), వైద్య చికిత్సలు తీసుకున్న తర్వాత మూత్రం వాసన మారవచ్చు.




## నీళ్లు తక్కువగా తాగుతున్నారా..!



వేసవి వచ్చిందంటే చాలు, భానుడి ప్రతాపం మామూలుగా ఉండదు. ఉష్ణోగ్రతలు పెరిగిన ప్రతిసారీ, ఒక ఆందోళనకరమైన ఆరోగ్య సమస్య కూడా పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అదే కిడ్నీలో రాళ్లు. చాలామందికి తెలియని విషయం ఏమిటంటే, అధిక వేడి, సరైన నీటి వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్ల ఈ సమస్య ఈ సీజన్‌లో ఎక్కువగా కనిపిస్తుంది. మరి, వేసవిని 'రాళ్ల సీజన్' అని ఎందుకు పిలుస్తారు? వేసవి వచ్చిందంటే ఉష్ణోగ్రతలు పెరుగుతాయి, దాంతో పాటు కిడ్నీలో రాళ్ల సమస్యలు కూడా అధికమవుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువకుల్లో ఈ కేసులు గణనీయంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అధిక వేడి, డీహైడ్రేషన్, తగినంత ద్రవాలు తీసుకోకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అందుకే వేసవిని 'రాళ్ల సీజన్' అని కూడా పిలుస్తున్నారు. ముంబైలోని జైనోవా షాల్బీ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ చింతన్ గాయక్వాడ్ ప్రకారం, వేసవిలో అధిక చెమట కారణంగా శరీరం నీటిని కోల్పోతుంది. దీనికి తగినంత నీటిని తాగకపోతే, శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. "శరీరంలో నీరు తగ్గితే, మూత్రం చిక్కబడుతుంది. దీనివల్ల కాల్షియం, ఆక్సలేట్, యూరిక్ యాసిడ్ వంటి ఖనిజాలు మూత్రంలో పేరుకుపోయి, స్ఫటికాలుగా మారి కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి" అని డాక్టర్ గాయక్వాడ్ వివరించారు. కిడ్నీలో రాళ్లు అనేవి మూత్రపిండాలలో ఏర్పడే గట్టి నిర్మాణాలు. ఇవి ఖనిజాలు, లవణాలతో కూడి ఉంటాయి. ఇవి చిన్న ఇసుక రేణువుల నుండి గోల్ఫ్ బాల్ అంత పెద్దవిగా కూడా ఉండవచ్చు. మూత్ర నాళం ద్వారా ప్రయాణించేటప్పుడు ఇవి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. వీపు లేదా పక్కటెముకల వైపు తీవ్రమైన నొప్పి, మూత్రంలో రక్తం, తరచుగా మూత్ర విసర్జన, మంటగా అనిపించడం వంటివి ప్రధాన లక్షణాలు. ఎక్కువ చెమట, తక్కువ నీరు: వేసవిలో వేడిమికి ఎక్కువ చెమట పడుతుంది. దీనికి తగ్గట్టుగా నీరు తాగకపోతే మూత్రం చిక్కబడుతుంది. అధిక ఉప్పు వాడకం: వేసవిలో ఎక్కువగా తినే చిరుతిళ్లు, ప్రాసెస్ చేసిన ఆహారాల్లో ఉప్పు ఎక్కువగా ఉంటుంది, ఇది రాళ్ల ఏర్పడటానికి దారితీస్తుంది. ఆహారపు అలవాట్లు: చక్కెర పానీయాలు, ప్రాసెస్ చేసిన స్నాక్స్ ఎక్కువ తీసుకోవడం, నీరు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తక్కువ తినడం కూడా ఒక కారణం.

# ఒళ్ళు నొప్పులు బాధిస్తున్నాయా?




ఉదయం మీరు లేచిన వెంటనే శరీరం నొప్పి అనిపిస్తే దాన్ని మాములుగా తీసుకోకండి. ఈ సమస్యని కొంత మంది సాదారణంగా తీసుకుంటారు కానీ కొన్నిసార్లు ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతంగా కూడా ఉంటుంది. నిద్రపోయిన తర్వాత శరీరం తాజాగా ఉండాలి కానీ ప్రతిరోజూ నొప్పి అనిపిస్తే అది శరీరంలో ఏదో తేడా జరుగుతోందని సూచిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో అసలు కారణాలను తెలుసుకోవడం చాలా అవసరం. ఉదయం ఆరోగ్యంగా లేచి పనులు ప్రారంభించగలిగితే రోజు బాగా సాగుతుంది. కానీ ఉదయం నొప్పితో లేస్తే మనసు బాగుండదు. ఉదయం వచ్చే శరీర నొప్పి చిన్నదిగా అనిపించినా.. అది రోజంతా ప్రభావం చూపుతుంది. చాలా మంది ఉదయం శరీరం నొప్పిగా ఉందని ఫిర్యాదు చేస్తారు. అయితే ఎందుకు నొప్పిగా ఉందో వారికి స్పష్టంగా తెలియదు. ఈ సమస్యను గమనించకపోతే అది మరింత పెరిగే అవకాశం ఉంది. రాత్రిపూట కొంత మంది శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతారు. ఇది ఆక్సిజన్ లోపానికి దారి తీస్తుంది. నిద్రలో శరీరానికి సరిపడా ఆక్సిజన్ లభించకపోతే ఉదయం లేచిన వెంటనే శరీర నొప్పి వస్తుంది. దీని వల్ల ఒళ్లంతా అలసటగా, బలహీనంగా అనిపించవచ్చు. ఇది గమనించాల్సిన ముఖ్యమైన కారణం. మనం పడుకునే పరుపు కూడా శరీర నొప్పికి ప్రధాన కారణం కావొచ్చు. పరుపు చాలా పాతదిగా లేదా గట్టిగా ఉంటే.. అది శరీరానికి సరైన సపోర్ట్ ఇవ్వదు. దీని వల్ల నిద్రపోతున్నప్పుడు శరీర భాగాలపై ఒత్తిడి పడుతుంది. అలాంటి పరుపుపై పడుకుంటే ఉదయం లేవగానే నొప్పి వస్తుంది. పరుపు మార్చే వరకు ఈ సమస్య అలాగే ఉంటుంది. ప్రతి ఒక్కరి నిద్రపోయే పద్ధతి వేరుగా ఉంటుంది. కొంతమంది తల ఎత్తి పడుకుంటే, మరికొంతమంది ఒక పక్కకు తిరిగి పడుకుంటారు. ఈ స్థితులలో శరీరం సరిగ్గా విశ్రాంతి తీసుకోలేకపోవడం వల్ల కొన్ని భాగాల్లో నొప్పి రావొచ్చు. మీ నిద్రపోయే పద్ధతిని మార్చుకోవడం వల్ల ఈ సమస్య నుండి ఉపశమనం పొందవచ్చు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ శరీర భాగాల్లో మార్పులు జరుగుతాయి. కీళ్లలో తేమ తగ్గిపోవడం, చిన్న వయస్సులోనూ వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో కూడా నొప్పి వస్తుంది. శరీరానికి సరిపడా జాగ్రత్తలు తీసుకోకపోతే రోజూ ఉదయాన్నే నొప్పితో లేచే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సమస్యలు సాదారణంగా కనిపించే విషయాలు. కానీ ఏ సమస్య అయినా ఎక్కువ రోజులు ఉంటే తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలి. ఇంట్లో తీసుకునే చిన్న జాగ్రత్తలు ఉపశమనం ఇస్తాయి కానీ శాశ్వత పరిష్కారం కావాలంటే నిపుణుడి సూచన తప్పనిసరి.

# గర్భిణులు ఇన్‌స్టంట్ నూడుల్స్ తినొచ్చా?

గర్భధారణ సమయంలో మహిళలకు రకరకాల ఆహార కోరికలు (క్రేవింగ్స్) కలగడం సహజం. అటువంటి సమయంలో త్వరగా తయారయ్యే, రుచిగా ఉండే ఇన్‌స్టంట్ నూడుల్స్ తినాలని అనిపించవచ్చు. అయితే, ఇన్‌స్టంట్ నూడుల్స్ గర్భిణులకు సురక్షితమేనా? అనే ప్రశ్న చాలా మందిలో ఉంటుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, వీటిని అప్పుడప్పుడు, కొన్ని మార్పులతో తింటే పెద్దగా సమస్య ఉండదని, కానీ తరచుగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదని స్పష్టం చేస్తున్నారు. ఇన్‌స్టంట్ నూడుల్స్ ప్రధానంగా గోధుమ పిండి (మైదా), స్టార్చ్, పామాయిల్, ఉప్పుతో తయారవుతాయి. 100 గ్రాముల నూడుల్స్‌లో సుమారు 385 నుండి 453 కేలరీలు, 65 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 17 గ్రాముల కొవ్వు, 7.6 గ్రాముల సంతృప్త కొవ్వు, 9 గ్రాముల ప్రోటీన్, 2.4 గ్రాముల ఫైబర్, 1160 మి.గ్రా సోడియం ఉంటాయి. గర్భధారణ సమయంలో అవసరమైన పోషకాలు విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్, ప్రోటీన్లు వీటిలో చాలా తక్కువగా ఉంటాయి. ఇన్‌స్టంట్ నూడుల్స్ రుచిగా ఉన్నా, గర్భధారణ సమయంలో వీటి వినియోగాన్ని పరిమితం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో సోడియం (ఉప్పు) శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది గర్భిణులలో కాళ్ల వాపు (ఎడెమా)ను పెంచుతుంది, రక్తపోటును పెంచుతుంది. ఇది తల్లికి, బిడ్డకు హానికరం. ఎక్కువ ఉప్పు తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డకు భవిష్యత్తులో అధిక రక్తపోటు, కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. గర్భిణులకు, పిండం పెరుగుదలకు అవసరమైన ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు వీటిలో ఉండవు. వీటిపై ఎక్కువగా ఆధారపడితే పోషకాహార లోపాలు వచ్చే అవకాశం ఉంది. ఇన్‌స్టంట్ నూడుల్స్ శుద్ధి చేసిన గోధుమ పిండి (మైదా)తో తయారవుతాయి. ప్రాసెసింగ్ సమయంలో వీటిలోని పోషకాలు తొలగిపోతాయి. మైదా జీర్ణం కావడం కూడా కష్టం, ఫైబర్ తక్కువగా ఉంటుంది. వీటిలో ఉండే ట్రాన్స్ ఫ్యాట్స్, అధిక సంతృప్త కొవ్వులు గర్భిణులలో కొలెస్ట్రాల్‌ను పెంచి, గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి. షెల్ఫ్ లైఫ్ పెంచడానికి వంటి సంరక్షకాలను వాడతారు. అధికంగా తీసుకుంటే వికారం, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు రావొచ్చు. గర్భధారణ సమయంలో ఇన్‌స్టంట్ నూడుల్స్‌ను తరచుగా తినడం వల్ల ఈ ఆరోగ్య సమస్యలు రావొచ్చు.వీటిలో అధిక కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల గర్భధారణ మధుమేహం వచ్చే ప్రమాదం పెరుగుతుంది. బరువు పెరగడం: అధిక కొవ్వు, కేలరీలు అనారోగ్యకరమైన బరువు పెరుగుదలకు దారితీసి, ప్రీఎక్లంప్సియా లేదా సిజేరియన్ వంటి సమస్యలకు కారణం కావచ్చు. మైదా వాడటం వల్ల గర్భధారణలో హార్మోన్ల మార్పులు, గర్భాశయ ఒత్తిడితో వచ్చే మలబద్ధకం మరింత తీవ్రమవుతుంది.







# విజయ్ దేవరకొండకు కాంతారావు స్మారక పురస్కారం

## స్పందించిన నటుడు

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ 2025లో నటుడు విజయ్ దేవరకొండకి 'కాంతారావు స్మారక పురస్కారం' ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తనకు ఈ అవార్డు ప్రకటించడంపై విజయ్ తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలను తెలియజేస్తూ విజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ”గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ 2025లో నాకు కాంతారావు స్మారక పురస్కారం రావడం చాలా గౌరవంగా ఉంది. నట ప్రపూర్ణ కాంతారావు గారి పేరు మీద ఈ అవార్డు రావడం నా అదృష్టం. తెలంగాణ ప్రభుత్వానికి, జ్యూరీకి, నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికీ నా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నాను”. అలాగే, 2016లో వచ్చిన పెళ్లిచూపులు సినిమాకి 2వ ఉత్తమ చిత్రంగా అవార్డు రావడం కూడా సంతోషంగా ఉంది. పెళ్లిచూపులు ఎప్పటికీ నా గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుంది. నా అభిమానులందరికీ, ఇది మీకోసమే. మీ ప్రేమ నాకు ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంది. నా కుటుంబ సభ్యులకి, డైరెక్టర్స్‌కి, నా టీమ్‌కి.. ఈ ప్రయాణంలో నాతో ఉన్నందుకు ధన్యవాదాలు. ఎప్పటికీ కృతజ్ఞుడిని. ఇట్లు మీ విజయ్ దేవరకొండ అంటూ విజయ్ రాసుకోచ్చాడు.

# జార్జియాలో 'అఖండ 2'

## షూటింగ్ వీడియో వైరల్

నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న సంచలన చిత్రం 'అఖండ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమా కీలక షెడ్యూల్ కోసం చిత్ర బృందం జార్జియా చేరుకుంది. అక్కడ బాలయ్యపై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. 'అఖండ' సృష్టించిన ప్రభంజనం తర్వాత, దాని సీక్వెల్ 'అఖండ 2' (అఖండ 2 –తాండవం) పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్, ఇప్పుడు జార్జియాలోని సుందరమైన ప్రదేశాలను ఎంచుకుంది. బోయపాటి శ్రీను ఈ యాక్షన్ బ్లాక్‌లను అత్యంత భారీ ఎత్తున ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌లో విదేశీ ఫైటర్స్ కూడా పాల్గొననున్నారని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో కూడా ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు ఈ జార్జియా షెడ్యూల్‌లోనే బాలయ్య రెండో పాత్రకు సంబంధించిన ఒక భారీ ట్విస్ట్ కూడా రివీల్ అవుతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, యంగ్ హీరో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నారు. బాలయ్య మరోసారి అఘోరి పాత్రలో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. గతంలో 'గౌతమిపుత్ర శాతకర్ణి' షూటింగ్ కూడా జార్జియాలో జరిగింది. ఇప్పుడు 'అఖండ 2' వంటి భారీ పాన్ ఇండియా చిత్రానికి కూడా అదే లొకేషన్ ఎంచుకోవడంతో, విజువల్స్ అద్భుతంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# వెరైటీ డ్రెస్సులో సమంత.. కళ్ళు చెదిరిపోయేలా అందాల జాతర





# ఆయన కొడుకొచ్చాడని చెప్పు

## 'భైరవం' విడుదల రోజున మంచు మనోజ్ ఎమోషనల్ పోస్ట్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం భైరవం. మంచు మనోజ్, నారా రోహిత్ కీలక పాత్రల్లో కనిపించారు. తమిళంలో సూపర్ హిట్టైన 'గరుడన్' చిత్రానికి ఇది రీమేక్‌గా వచ్చింది. 'నాంది', 'ఉగ్రం' వంటి విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన విజయ్ కనకమేడల ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధా మోహన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా సమ్మర్ కానుకగా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమా నేడు విడుదల కాగా.. ఈ సందర్భంగా మంచు మనోజ్ ఆసక్తికర పోస్ట్‌ను పెట్టాడు. ఈ సినిమాకు మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ రావడంతో ఆనందంలో ఉన్న మంచు మనోజ్ ఒక ఎమోషనల్ పోస్ట్‌ను పంచుకున్నాడు. తన తండ్రి మోహన్ బాబు పెద్ద రాయుడు ఫొటోను తీసుకుని పక్కన భైరవంలోని తన గజపతి పాత్ర ఫొటోను ఎడిట్ చేసి పెట్టాడు. దీనికి 'ఆయన కొడుకు వచ్చాడని చెప్పు' అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది. మరోవైపు భైరవం సినిమా చూసిన ప్రేక్షకులు మంచు మనోజ్ కమ్ బ్యాక్ ఇచ్చాడంటూ కామెంట్స్ చేస్తున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత మనోజ్ మంచి హిట్టు కొట్టాడంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లో పాల్గొన్న నటి



అర్చనా సింగ్... తెలుగు ప్రేక్షకులకు ఈ పేరు కొత్తగా అనిపించినా, కన్నడ, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమల్లో ఆమె ఓ సుపరిచిత నటి. కన్నడలో కాంతామణిగా పేరొందిన అర్చనా, ఇటీవల హిమాలయాల్లోని "ఎవరెస్ట్ బేస్ క్యాంప్" సాహస యాత్రలో పాల్గొని తన ధైర్యాన్ని చాటింది. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనేదే తన లక్ష్యమని చెప్పకనే చెప్పింది. ఎం.బి.ఏ. పట్టభద్రురాలైన అర్చనా, సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే, "విప్రో", "ఐ.టి.సి. గ్రూప్ ఆఫ్ హొటల్స్", "కింగ్ ఫిషర్", "జెట్ ఎయిర్‌లైన్స్" వంటి ప్రముఖ సంస్థల్లో ఎయిర్ హొస్టెస్‌గా పనిచేసింది. కన్నడ, తమిళ చిత్రాల్లో నటించిన ఈ అందాల నటి, తెలుగులో "దమయంతి – కౌశిక్ వర్మ" చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రస్తుతం "మై ఫాదర్ – మై హీరో" అనే చిత్రంతో మలయాళంలో అరంగేట్రం చేస్తోంది, ఈ చిత్రం ఇంగ్లీష్‌లోనూ రూపొందుతోంది. శాస్త్రీయ నృత్యంలో నైపుణ్యం కలిగిన అర్చనా, సమయం దొరికినప్పుడల్లా నృత్య ప్రదర్శనలు కూడా ఇస్తుంది. కన్నడ, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్‌లలో స్వీయవంతంగా మాట్లాడే ఆమె, తెలుగు, తమిళ భాషల్లోనూ పట్టు సాధించింది. ౦

## బంగారం నిల్వలను పెంచిన ఆర్బీఐ




బంగారం సురక్షితమైన పెట్టుబడి ఎంపికలలో ఒకటిగా పరిగణిస్తారు. అలాగే ఇది విదేశీ మారక నిల్వలలో ముఖ్యమైన భాగం. ప్రపంచ అస్థిరతను, డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో ఆర్బీఐ బంగారంలో తన వాటాను పెంచుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ రికార్డు స్థాయిలో బంగారాన్ని కొనుగోలు చేసింది. ఆర్బీఐ వార్షిక నివేదిక ప్రకారం.. మార్చి 31, 2025 నాటికి మొత్తం 879.58 మెట్రిక్ టన్నుల బంగారం ఉంది. ఇది ఒక సంవత్సరం క్రితం 822.10 మెట్రిక్ టన్నులు. అంటే, ఖీ25లో 57.48 మెట్రిక్ టన్నుల పెరుగుదల ఉంది. ఖీ25 లో ఆర్బీఐ తన బంగారు నిల్వలను పెంచడమే కాకుండా ప్రపంచ స్థాయిలో భారతదేశ ఆర్థిక బలాన్ని కూడా బలోపేతం చేసింది. నివేదిక ప్రకారం, మార్చి 31, 2024 నాటికి రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న బంగారం విలువ రూ. 2,74,714.27 కోట్లు. ఇది మార్చి 31, 2025 నాటికి రూ.4,31,624.80 కోట్లకు పెరిగింది. అంటే 57.12 శాతం పెరుగుదల ఉంది. ఈ పెరుగుదలకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది 57.48 మెట్రిక్ టన్నుల అదనపు బంగారం కొనుగోలు, రెండవది అంతర్జాతీయ బంగారం ధరల పెరుగుదల. అలాగే డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం. మార్చి 31, 2025 నాటికి బ్యాంకింగ్ శాఖ వద్ద మొత్తం 568.20 మెట్రిక్ టన్నుల బంగారం ఉంది. గత సంవత్సరం ఇది 514.07 మెట్రిక్ టన్నులు. 2024లో 308.03 మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ఇష్యూ విభాగంలో మార్చి 31, 2025 నాటికి 311.38 మెట్రిక్ టన్నుల బంగారం ఉంది. బంగారం సురక్షితమైన పెట్టుబడి ఎంపికలలో ఒకటిగా పరిగణిస్తారు. అలాగే ఇది విదేశీ మారక నిల్వలలో ముఖ్యమైన భాగం. ప్రపంచ అస్థిరతను, డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో ఆర్బీఐ బంగారంలో తన వాటాను పెంచుతోంది. ఈ సంవత్సరం ఆర్‌బిఐ బ్యాలెన్స్ షీట్ 8.2 శాతం పెరిగి రూ.70.47 లక్షల కోట్ల నుంచి రూ.76.25 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ పెరుగుదలకు ప్రధాన కారణం దేశీయ, విదేశీ పెట్టుబడుల పెరుగుదలతో పాటు బంగారు నిల్వలు వేగంగా పెరగడం.

## ఓలా ఎలక్ట్రిక్ నష్టాలు రెట్టింపు




ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ భారీ నష్టాలను మూటగట్టుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో రూ.870 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.416 కోట్ల నష్టాలతో పోల్చితే రెట్టింపు పైగా పెరగడం గమనార్హం. గడిచిన క్యూ4లో కంపెనీ రెవెన్యూ కూడా 59.48 శాతం క్షీణించి రూ.611 కోట్లకు పరిమితమయ్యింది. 2023-24 ఇదే క్యూ4లో ఏకంగా రూ.1,508 కోట్ల రెవెన్యూ సాధించింది. 2024-25లో మొత్తంగా రూ.4,645 కోట్ల రెవెన్యూ నమోదు చేయగా.. ఇంతక్రితం ఏడాదిలో ఏకంగా రూ.5,126 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. క్రితం క్యూ4లో కంపెనీ అమ్మకాలు 51,375 యూనిట్లకు పరిమితమయ్యాయి. 2023-24 ఇదే త్రైమాసికంలో 1.15 లక్షల యూనిట్ల అమ్మకాలు చేసింది. ద్విచక్ర ఇవి అమ్మకాల్లో గతేడాది వరకు నెంబర్ వన్‌గా ఓలా ఎలక్ట్రిక్ ఇటీవల మార్కెట్ వాటాలో మూడో స్థానానికి పడిపోయింది. టీవీఎస్ మోటార్, బజాజ్ ఆటో ప్రథమ, ద్వితీయ స్థానాల్లోకి వచ్చాయి.

## ఆ ఎఫ్‌డీ పథకాల్లో వడ్డీ ఎంతో స్పెషల్!



ఇటీవల చాలా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లను తగ్గించాయి. ముఖ్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ సంవత్సరం రెండుసార్లు రెపో రేటును తగ్గించింది. ఇది బ్యాంకుల ఎఫ్‌డీ రేట్లను కూడా ప్రభావితం చేసింది. అయితే కొన్ని బ్యాంకులు ఇప్పటికీ పెట్టుబడిదారులను ఆకర్షించడానికి ప్రత్యేక ఎఫ్‌డీ పథకాలను అందిస్తున్నాయి. ఇవి సాధారణ ఎఫ్‌డీల కంటే ఎక్కువ వడ్డీ రేటును అందిస్తున్నాయి. స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్ అనేది వాస్తవానికి పరిమిత కాలానికి ప్రారంభించబడిన ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం. దీని కాలపరిమితి కూడా ప్రత్యేకంగా ఉంటుంది. 444 రోజులు, 400 రోజులు లేదా 300 రోజుల వ్యవధితో ఈ పథకాలను బ్యాంకులు అందిస్తాయి. సాధారణంగా బ్యాంకులు అందించే ఎఫ్‌డీ వడ్డీ రేట్ల కంటే ఈ స్కీమ్స్‌లో వడ్డీ రేట్లు అధికంగా ఉంటాయి. ఈ స్కీమ్ పరిమిత కాలానికి అందుబాటులో ఉంటుంది. కాబట్టి త్వరిత నిర్ణయం తీసుకోవడం ద్వారా పెట్టుబడి పెట్టడానికి ఒక అవకాశమని నిపుణులు చెబుతున్నాయి. అలాగే తక్కువ రిస్క్ పెట్టుబడి ఎంపికగా స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్స్ ఉంటాయి. సీనియర్ సిటిజన్లు, సూపర్ సీనియర్ సిటిజన్లు అదనపు వడ్డీ రేటు ప్రయోజనాన్ని పొందవచ్చు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన అమృత్ వృష్టి యోజన కింద 444 రోజుల వ్యవధితో స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్‌ను అందుబా టులో ఉంది. ఈ స్కీమ్ కింద సాధారణ పౌరులకు సంవత్స రానికి 6.85 శాతం, సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 7.35 శాతం వడ్డీ ఇస్తున్నారు. అలాగే సూపర్ సీనియర్ సిటి జన్లకు సంవత్సరానికి 7.45 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఈ నూతన వడ్డీ రేట్లు మే 16, 2025 నుండి అమల్లోకి వచ్చా యి. కెనరా బ్యాంక్ రూ.3 కోట్ల కంటే తక్కువ మొత్తాలకు 444 రోజుల ఎఫ్‌డీ స్కీమ్ అందుబాటులో ఉంచింది. ఈ స్కీమ్ కింద సాధారణ పౌరులకు సంవత్సరానికి 7.25 శాతం, సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 7.75 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఈ రేట్లు ఏప్రిల్ 10, 2025 నుంచి అమల్లోకి వచ్చాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ పథకం కింద 444 రోజుల ఎఫ్‌డీ స్కీమ్ అందుబాటులో ఉంచింది. ఈ స్కీమ్ కింద సాధారణ పౌరులకు సంవత్సరానికి 7.10 శాతం, సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 7.60 శాతం వడ్డీ రేట్లను అందిస్తున్నారు. సూపర్ సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 7.70 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఈ సవరించిన రేట్లు మే 5, 2025 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇండియన్ బ్యాంక్‌నకు సంబంధించిన ప్రత్యేక ఎఫ్‌డీ స్కీమ్ ఐఎన్‌డీ సెక్యూర్ 444 రోజులకు అందుబాటులో ఉంచారు. ఈ స్కీమ్ కింద సాధారణ పౌరులకు సంవత్సరానికి 7.15 శాతం, సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 7.65 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 7.90 శాతం వడ్డీ ఇస్తున్నారు. ఈ పథకం 2025 సెప్టెంబర్ 30 వరకు ఖాతాదారులకు అందుబాటులో ఉండనుంది.

# నోట్ల ముద్రణకు ఆర్‌బీఐ ఏడాదిలో ఎంత ఖర్చు చేస్తుంది?

ఇక 50 పైసలు, ఒక రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయలు, 10 రూపాయలు, 20 రూపాయల నాణేలు చెలామణిలో ఉన్నాయి. నకిలీ నోట్లకు సంబంధించి 2024-25లో బ్యాంకింగ్ రంగంలో స్వాధీనం చేసుకున్న మొత్తం నకిలీ భారతీయ కరెన్సీ నోట్లలో.. ఆర్‌బిఐకి నోట్ల ముద్రణ ఖరీదైనదిగా మారుతోంది. ఒక సంవత్సరంలో ఖర్చు గణనీయంగా పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు నోట్ల ముద్రణ వ్యయం వార్షిక ప్రాతిపదికన దాదాపు 25 శాతం పెరిగి రూ.6,372.8 కోట్లకు చేరుకోగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.5,101.4 కోట్లుగా ఉంది. గురువారం విడుదలైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2024-25 వార్షిక నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చెలామణిలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ, పరిమాణం వరుసగా ఆరు శాతం, 5.6 శాతం పెరిగాయి. నివేదిక ప్రకారం, 2024-25లో రూ. 500 బ్యాంకు నోట్ల వాటా 86 శాతంగా ఉంది. ఇది విలువ పరంగా స్వల్పంగా తగ్గింది. మొత్తం బ్యాంకు నోట్లలో పరిమాణం పరంగా చూస్తే, రూ.500 డినామినేషన్ నోట్లు అత్యధికంగా 40.9 శాతం వాటాను కలిగి ఉన్నాయని తెలిపింది. దీని తరువాత రూ.10 డినామినేషన్ నోట్ల వాటా 16.4 శాతంగా ఉంది. చెలామణిలో ఉన్న మొత్తం బ్యాంకు నోట్లలో తక్కువ విలువ కలిగిన బ్యాంకు నోట్ల (రూ. 10, రూ. 20, రూ. 50) వాటా 31.7 శాతం. 2000 రూపాయల నోట్లను చెలామణి నుండి ఉపసంహరించుకోవడం మే 2023లో ప్రారంభమైంది. ఇది గత ఆర్థిక సంవత్సరం కూడా కొనసాగింది. ప్రకటన సమయంలో చెలామణిలో ఉన్న రూ.3.56 లక్షల కోట్లలో 98.2 శాతం మార్చి 31, 2025 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థకు తిరిగి వచ్చాయి. 2024-25లో చెలామణిలో ఉన్న నాణేల విలువ, పరిమాణం వరుసగా 9.6 శాతం. అలాగే 3.6 శాతం పెరిగాయి. అలాగే, 2024-25 ఆర్థిక సంవత్సరంలో చలామణిలో ఉన్న ఈ-రూపాయి విలువ 334 శాతం పెరిగింది. చెలామణిలో ఉన్న కరెన్సీలో నోట్లు, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీలు, నాణేలు ఉన్నాయి. ప్రస్తుతం, రూ.2, రూ.5, రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500, రూ.2000 విలువల నోట్లు చెలామణిలో ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఇకపై రూ.2, రూ.5, రూ.2000 డినామినేషన్ల బ్యాంకు నోట్లను ముద్రించదం లేదు.






Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com